Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి :1 సంచిక :228 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 సెప్టెంబర్ 2023 గురువారం పేజీలు :4

## ఇండియాతో బీజేపీలో వణుకు!

న్యూఢిల్లీ : జీ20 సదస్సుకు సంబంధించిన విందు ఆహ్వానపత్రికలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'గా పేర్కొనడంపై తీవ్ర దుమారం రేగుతోంది. తమ కూటమి పేరును 'ఇండియా'గా పెట్టుకోవడంతో బీజేపీ తీవ్రంగా భయపడుతోందని కాంగ్రెస్ మండిప డింది. ఆ పేరు కమలనాథుల్లో వణుకుపుట్టిస్తోందని ఎద్దేవా చేసింది. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి వ్యవహారాలను తెరపైకి తెస్తోందని ఆ పార్టీ నేతలు ధ్వజమెత్తారు. జీ20 విందు ఆహ్వానపత్రికను కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ ట్విటర్ (ఎక్స్)లో పోస్ట్ చేయడంతో ఈ రగడ మొదలైం ది. తొలుత కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్ దీనిపై స్పందిం చారు. "అంటే ఈ వార్త నిజమేనన్న మాట. రాష్ట్రపతి భవన్ సెప్టెంబరు 9నాటి జీ20 డిన్నర్ ఇన్విటేషన్‌ను ఎప్పటిలా 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా' పేరుతో కాకుండా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరుతో పంపారు. ఇప్పుడు రాజ్యాంగంలోని ఒకటో అధికరణాన్ని.. 'భారత్, అది ఇండియా, రాష్ట్రాల సమాహారం' అని చదువుకోవాలన్నమాట" అని జైరామ్ ట్వీట్ చేశారు.




# తరలిరానున్న దేశాధినేతలు

## జీ 20 సదస్సుకు సిద్ధమైన హస్తినాపురి

### సదస్సుకు హాజరు కానున్న బైడెన్, అల్బనీస్, ట్రూడో, ఒలాఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: భారతదేశం అధ్యక్షతన ఈనెల 8 నుంచి ఢిల్లీలో జరగనున్న జీ20 సదస్సుకు వివిధ దేశాధినేతలు హాజరుకానుండగా, తాము రావడం లేదని కొందరు సందేశాలు పంపారు. ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్, వాతావరణ మార్పులు తదితర కీలకమైన ప్రపంచవ్యాప్త సమస్యలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. వీరిలో పలువురు ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు కూడా జరపనున్నారు.

**సదస్సుకు వచ్చేది వీరే..** అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఈనెల 7నే అమెరికా నుంచి బయలుదేరనున్నారు. సదస్సుకు ముందు ప్రధాని మోదీతో ఆయన ద్వైపాక్షిక చర్చలు జరుపుతారని వైట్‌హౌస్ ప్రకటించింది. 9, 10 తేదీల్లో ఆయన సదస్సులో పాల్గొంటారని తెలిపింది. కాగా, ప్రయాణానికి ముందు నిర్వహించిన కొవిడ్ పరీక్షల్లో జో బైడెన్‌కు నెగెటివ్ రాగా, ఆయన భార్య జిల్ బైడెన్‌కు పాజిటివ్ వచ్చింది. బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ కూడా సదస్సుకు హాజరుకానున్నారు. భారత సంతతికి చెందిన ఆయన బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌లో చేపట్టనున్న తొలి అధికారిక పర్యటన ఇది. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, కెనడా ప్రధాని ట్రూడో ఇండోనేసియాలో జరగనున్న ఆసియాన్ సదస్సులో పాల్గొని, అక్కడి నుంచి నేరుగా భారత్‌కు చేరుకొని, జీ20 సదస్సులో పాల్గొంటారు. జర్మనీ చాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిద, దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్-యెవో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా జీ20 సదస్సుకు హాజరుకానున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం గురించి సదస్సులో జరిపే చర్చను కిషిద ప్రారంభించే అవకాశం ఉంది. మేక్రాన్ ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు కూడా జరిపే అవకాశం ఉంది. దక్షిణాఫ్రియా అధ్యక్షుడు సిరిల్ రమఫోస జీ20 గ్రూప్‌లో భారత అధ్యక్షతకు పూర్తి మద్దతు ప్రకటించారు. వీరితో పాటు పలు దేశాల అధినేతలు సదస్సులో పాల్గొంటారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారతదేశ ఆహ్వానం మేరకు పరిశీలకుల హోదాలో సదస్సులో పాల్గొంటారు.

**వీరు రావట్లేదు..** ఉక్రెయిన్‌లో యుద్ధ నేరాలకు సంబంధించి అంతర్జాతీయ నేర న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీ చేసిన నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది జీ20 సదస్సుకు హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్‌రోవ్‌ను జీ20 సదస్సుకు పంపుతున్నారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా సదస్సుకు హాజరుకావడం లేదు. చైనా నుంచి ఈ సదస్సుకు హాజరయ్యే బృందానికి ప్రధాని లీ ఖియాంగ్ నేతృత్వం వహిస్తారని చైనా ప్రకటించింది. 2008 సంవత్సరం నుంచి జీ20 సదస్సులు నిర్వహిస్తుండగా, చైనా అధ్యక్షుడు గైర్హాజరవడం ఇదే తొలిసారి.

**వీరి రాక ఇంకా నిర్ధారణ కాలేదు..** యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సుల వాన్ డెర్ లియెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు చార్లెస్ మైకేల్ సదస్సుకు హాజరయ్యేదీ లేనిదీ ఇంకా నిర్ధారించలేదు.

మెక్సికో అధ్యక్షుడు మాన్యుయెల్ లోపెజ్ ఒబ్రడార్ ఈ ఏడాది జీ20 సదస్సుకు హాజరుకాకపోవచ్చని భావిస్తున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మలోనీ, ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడో కూడా జీ20 సదస్సుకు హాజరయ్యే విషయాన్ని ఇంకా నిర్ధారించలేదు.




## నేడు ఆప్షనల్ హాలిడే..

హైదరాబాద్ : మహమ్మద్ ప్రవక్త మనవడు హుస్సేన్ బలిదానానికి సంస్మరణగా 40వ రోజు షియా ముస్లింలు అర్బాయిన్‌ను జరుపుకుంటారు. అయితే ఈ సందర్భంగా గతంలో ఈ నెల 6వ తేదీన తెలంగాణ ప్రభుత్వం ఆప్షనల్ హాలిడే ఇచ్చింది.

ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఓ సర్క్యులర్ జారీ చేశారు. తాజాగా ఆ సెలవును 7వ తేదీకి మారుస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ పేర్కొన్న కారణాల దృష్ట్యా బుధవారం బదులుగా 7వ తేదీన సెలవును ఇవ్వడం జరిగింది.

అరబియన్ ఐచ్ఛిక సెలవు ప్రకటించారు దీంతో అర్బాయిన్ జరుపుకునే ప్రాంతాల్లో రేపు సెలవు ఉండనుంది.

## అలిగిన కోమటిరెడ్డి!.. రంగంలోకి ఏఐసీసీ.. కేసీ వేణుగోపాల్ ఫోన్.. రాత్రే భేటీ




హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి కొన్నిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఇవాళ జరిగిన స్క్రీనింగ్ కమిటీ కీలక భేటీకి సైతం ఆయన డుమ్మా కొట్టారు. ఇంతకాలం పార్టీనే తన తొలి ప్రాధాన్యతగా చెబుతూ వస్తున్న ఆయన.. ఇప్పుడు ఆత్మగౌరవం ముఖ్యమంటూ స్వరం మార్చడం గమనార్హం.

ఆయన అలక వెనుక సరైన కారణం తెలియనప్పటికీ.. కీలక పదవులు దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనానికి లోనైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బుజ్జగింపులకు ఏఐసీసీ రంగంలోకి దిగింది. ఏఐసీసీ ఆదేశాలనుసారం.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎంపీ కోమటిరెడ్డికి ఫోన్ చేసినట్లు తెలుస్తోంది. సమస్యల్ని అంతర్గతంగానే.. సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. ఇవాళ ఆయన హైదరాబాద్ వస్తున్న నేపథ్యంలో.. వచ్చి తనను కలవాలని సూచించినట్లు సమాచారం. అదే సమయంలో తెలంగాణ కాంగ్రెస్ ఇంఛార్జి మాణిక్‌రావు ఠాక్రే.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇంటికి వెళ్తారని, అసంతృప్తిగా ఉన్న కోమటిరెడ్డిని బుజ్జగిస్తారని తెలుస్తోంది. కోమటిరెడ్డి ఇంటికి వెళ్తున్న.. ఆయనతో భేటీ అవుతా అంటూ స్క్రీనింగ్ కమిటీ భేటీ ముగిసిన అనంతరం ఠాక్రే సైతం ప్రకటన చేశారు. అయితే కోమటిరెడ్డి స్ట్రాంగ్ లీడర్ అని, ఆయన అలగరు అని సీనియర్ నేత భట్టి చెబుతుండడం గమనార్హం. రేవంత్‌రెడ్డి పీసీసీ నాయకత్వాన్ని విబేధిస్తూ.. పార్టీ కార్యక్రమాలకు కొంతకాలం దూరంగా ఉన్నారు కోమటిరెడ్డి. అయితే కర్ణాటక ఎన్నికల విజయం తర్వాత కలిసి పని చేయాలనే అధిష్టానం ఆదేశాలతో కలుపుగోలుగా పని చేయాలని భావించారు.

ఈ తరుణంలో.. పార్టీలో చేరికలు, సీట్ల కేటాయింపు అంశం మళ్లీ కోమటిరెడ్డిని అసహనానికి లోను చేశాయి. ఈలోపు కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ రెండింటిలో జాబితా వెలువడడం.. ఆ రెండింటిలో తనకు పదవి దక్కకపోవడంతో ఆయన తీవ్ర నిరాశకు లోనైనట్లు స్పష్టమవుతోంది.



## 18న వినాయకచవితి..

### 28న నిమజ్జనం: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ

హైదరాబాద్: వినాయకచవితి ఎప్పుడనే విషయంపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఒక ప్రకటన చేసింది. ఈ నెల 18వ తేదీనే వినాయకచవితి పండుగని పేర్కొంది. అలాగే 28వ తేదీన నిమజ్జనం ఉంటుందని తెలిపింది. అంతకు ముందు 19న వినాయక చవితి, 29న నిమజ్జనం ఉంటుందని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రకటించిన సంగతి విదితమే. అయితే.. ఈ ఏడాది తిథి రెండు రోజులు ఉండడం వల్ల.. పండుగ ఎప్పుడనే దానిపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. అయితే.. శృంగేరి-కంచి పీఠాధిపతులు గణేష్ ప్రతిష్ట 18వ తేదీనే చేసుకోవాలని సూచించారట. కాబట్టి.. గ్రేటర్ పరిధిలోని మండపాలు 18వ తేదీనే వినాయక చవితి నిర్వహించుకోవాలని సూచించింది భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ.

# ఈ నెల 16న పాలమూరు - రంగారెడ్డి వెట్ రన్..

## ప్రారంభించనున్న సీఎం కేసీఆర్




హైదరాబాద్: ప్రపంచంలోనే భారీ పంపులతో ఎత్తిపోతలకు పాలమూరు - రంగారెడ్డి సిద్ధమైంది. ఇటీవల డ్రైన్‌ను అధికారులు విజయవంతంగా నిర్వహించిన తెలిసిందే. ఈ క్రమంలో వెట్ రన్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 16న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల వెట్ రన్ నిర్వహించనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నార్లాపూర్ ఇన్‌టేక్ వద్ద స్విచ్చాన్ చేసి ప్రారంభించనున్నారు. వెట్‌రన్‌లో భాగంగా రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్న నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కృష్ణానదికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వెట్‌రన్ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనుండగా.. సీఎం కేసీఆర్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. పాలమూరు-రంగారెడ్డి జిల్లాల్లోని పల్లెపల్లె నుంచి హాజరుకానున్న ప్రజలు, గ్రామ సర్పంచులు హాజరుకానున్నారు. ఎత్తిపోతల కృష్ణమ్మ జలాలను కలశాలతో ప్రతి గ్రామానికి తీసుకెళ్లి ఈ నెల 17న ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రతి గ్రామంలో దేవుళ్ల పాదాలకు అభిషేకం చేయనున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అడ్డంకులు తొలిగి కొలిక్కి వచ్చినందుకు గ్రామాల్లోని దేవాలయాల్లో స్వామివారి పాదాలను పాలమూరు జలాలతో అభిషేకం చేసి మన మొక్కులు చెల్లించుకుందామంటూ సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ దక్షిణ తెలంగాణకు పండుగ రోజులాంటిదని, సీఎం కేసీఆర్ ఎన్నో మొక్కులు మొక్కితే, దైవకృపతో, ఇంజినీర్ల కృషితో, పాలమూరు ఎత్తిపోతల పథకం అడ్డంకులు అధిగమించి సాకారమైందన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేసిన స్ఫూర్తితో పాలమూరు రంగారెడ్డిని పూర్తి చేయాలని, పట్టుదలతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను కొలిక్కి తేవడానికి జరిగిన కృషి లో కీలక పాత్ర పోషించిన సీఎంఓ అధికారులకు, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ అనుమతులతో పాటు అనేక అడ్డంకులను అధిగమించి చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో దక్షిణ తెలంగాణలోని పల్లెపల్లెకు తాగునీరు, సాగునీరు అందనున్నదని, బంగారు తెలంగాణ లక్ష్యం సంపూర్ణం కానున్నదని సీఎం పేర్కొన్నారు.

## సంపాదకీయం

# ఓ మై గాడ్...

## ఇండియాలో ఇన్ని లేఆఫ్ లా?

రంగం ఏదైనా.. ఉద్యోగం మరేదైనా.. ఈ మధ్యకాలంలో అనిశ్చిత ఆర్థిక పరిస్థితుల కారణంగా లేఆఫ్ ల మాటలు ఎక్కువగా వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోగా.. భారత్ లోనూ వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఈ క్రమంలో తాజాగా వెలుగులోకి వచ్చిన వీరి లెక్కలు విస్తుగొలిపేలా ఉన్నాయి. అవును... ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న మాట... లేఆఫ్. ఈ క్రమంలో టెక్ ఫోకస్డ్ హైరింగ్ సంస్థ టాప్ హైర్ తాజాగా ఒక డేటా విడుదల చేసింది. ఈ డేటాలో ఇప్పటివరకూ ఎంతమంది ఉద్యోగాలు కోల్పోయారనే విషయంపై వివరాలు వెల్లడించింది. ఈ లెక్కల ప్రకారం... గత రెండేళ్లలో భారతదేశంలో దాదాపు లక్షమంది ఉద్యోగాలు కోల్పోయారని టాప్ హైర్ ఆ సంస్థ పేర్కొంది. “లేఆఫ్స్ డాట్ ఫై” లెక్కల ప్రకారం... 2021 సెప్టెంబర్ 1 నుంచి ఇండియాలో సుమారు 27,850 మంది ఉద్యోగాలు కోల్పోయారు. అయితే టెక్ హైర్ సంస్థ నివేదించిన దానిలో ఇది సుమారు మూడింట ఒక వంతు మాత్రమే. అయితే ఈ విషయంపై టెక్ హైర్ వివరణ ఇచ్చింది. పబ్లిక్ గా ఉన్న వివరాలు మాత్రమే లేఆఫ్స్ డాట్ ఫై నివేధించి ఉండవచ్చు... సైలెంట్ లేఆఫ్ లు, బలవంతపు రాజీనామాల కారణంగా లెక్కల్లో ఈ భారీ వ్యత్యాసం ఉందని టెక్ హైర్ నివేదిక పేర్కొంది! ఈ లేఆఫ్ లలోలో ప్రత్యేకంగా ఎడ్ టెక్ రంగానికి సంబంధించిన ఉద్యోగులే ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా లేఆఫ్స్ డాట్ ఫై డేటా ప్రకారం.. భారతదేశంలో గత రెండు సంవత్సరాలలో నమోదైన మొత్తం తొలగింపులలో బైజూస్, అనకాడమీ, వేదాంతు, అప్ గ్రేడ్ వంటి కంపెనీలు 10,679 మందిని తొలగించాయి. ఈ ఎడ్ టెక్ రంగం తర్వాత స్థానాల్లో రిటైల్, ఈ-కామర్స్ రంగాలు ఉన్నాయని అంటున్నారు. ఈ రంగాల్లో గత రెండేళ్లలో అత్యధిక లేఆఫ్ లు అధికంగా నమోదయ్యాయని లేఆఫ్స్ డాట్ ఫై వివరాలు అందిస్తుంది. వీటిలో... మింత్రా, మీషో, మమాఎర్త్, ఫ్లిప్ కార్ట్, ఉడాన్, దుకాణ్ వంటి సంస్థలు సుమారు 3,400 మందిని తొలగిచాయని సంస్థ తెలిపింది. ఇదే క్రమంలో... ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ రంగాలలో కూడా సుమారు 3,190 ఉద్యోగాల కోతలు విధించబడ్డాయని తెలుస్తుంది. ఇలా భారీగా లే ఆఫ్ లకు పాల్పడిన రంగాల్లో... ఎడ్ టెక్ మొదటి స్థానంలో ఉండగా... రిటైల్, ఈ-కామర్స్ లు రెండో స్థానంలో నిలిచాయి. ఇదే సమయంలో ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ రంగాలు మూడో స్థానంలో నిలిచాయి.

# వీధి పశువులకు పెద్ద కష్టం



పెద్దపల్లి : పశువుల పాలిట ముద్దచర్మ(లంపీస్కిన్) వ్యాధి శాపంగా మారింది. ఈ వ్యాధి నివారణకు టీకాలు రావడంతో పోషకులకు కాస్త ఉపశమనం కలిగింది. అయితే వీధుల్లో తిరిగే మూగజీవాలు, పశుసంవర్ధక శాఖ గుర్తించని పశువులు వీటి బారిన పడి జీవచ్ఛవాలుగా మారుతున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా కొద్ది నెలల కిందట ముద్దచర్మ వ్యాధి ప్రబలింది. జిల్లాలోనూ పదుల సంఖ్యలో మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. రైతులు, పోషకుల సంరక్షణలో ఉన్న ఆవులు, దూడలకు జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేశారు. ముందస్తుగా గోట్ పాక్స్ వ్యాక్సిన్ ఇవ్వడంతో వ్యాధి ప్రబలకుండా అదుపులో ఉంది. వీధి పశువులకు, పశుసంవర్ధక శాఖ గుర్తించని ఆవులకు, దూడలకు టీకాలు వేయకపోవడంతో వ్యాధి బారిన పడ్డాయి. ముద్దచర్మ వ్యాధి బారిన పడిన ఆవులు ఈనినపుడు నెలల వయసు దూడలు రోగం బారిన పడ్డాయి. దీంతో తాత్కాలిక ఉపశమనం కోసం మిథిలిన్ బ్లూ మందు రాస్తున్నప్పటికీ పరిస్థితి దయనీయంగానే ఉంది. రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్ల పరిధిలో ప్రతి వీధిలో పదుల సంఖ్యలో ఆవులుంటాయి. వీటికి పోషకులు లేక, ఇటు పశు సంవర్ధక శాఖ పరిధిలోకి రాక ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి సంచరించే మూగజీవాలకు గుర్తింపు లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. రామగుండం నగరంలో స్వచ్ఛందంగా పని చేసే గోరక్షకులు, కార్యకర్తలు వీటి ఆచూకీ తెలుసుకొని తాత్కాలికంగా వాటికి సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా సొంత డబ్బులు పెట్టి పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి తీసుకొచ్చి మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

రామగుండంలోనే అధికం జిల్లాలోని మూడు ప్రాంతీయ పశు వైద్యశాలలు, 21 ప్రాథమిక పశువైద్య శాలలు, 15 ఉపకేంద్రాలు, 47 మంది గోపాలమిత్రలు, 10 మంది పశుమిత్రులకు ముద్దచర్మ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా 55 వేల ఆవులకు 55 వేల డోసుల గోట్‌పాక్స్ వ్యాక్సిన్‌ను గత సంవత్సరమే అందించారు. పశువైద్య శాఖ ముందస్తుగా అప్రమత్తం చేసి టీకాలు ఇచ్చిన ఆవులు కూడా ముద్దచర్మ వ్యాధి బారిన పడినా తక్షణ చికిత్సలు అందించారు. వీధి పశువుల విషయంలో ఒక్క రామగుండం నగరంలోనే వాడవాడలా పదుల సంఖ్యలో ఆవులు తిరుగుతుండటంతో వాటిని గుర్తించడం, చికిత్స అందించడం సిబ్బందికి కష్టసాధ్యంగా మారింది. ముద్దచర్మ వ్యాధి వీధి ఆవులకు, వాటి దూడలకు కూడా సోకుతోంది. స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు వీటిని గుర్తించి సొంత ఖర్చులతో వైద్యశాలలకు తీసుకొస్తున్నారు. ఎంత చేసినా వీటి విషయంలో వ్యాధి అదుపులోకి రావడం లేదు. వీధి పశువులను గుర్తించి, వాటికి ప్రభుత్వపరంగా షెడ్లు, గోశాలలు ఏర్పాటు చేస్తామని గతంలో నేతలు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చడం లేదు.

**జిల్లావ్యాప్తంగా 3 అంబులెన్సులు**

ఇప్పటివరకు పోషకులకు చెందిన ఆవులకు మాత్రమే ముందస్తు టీకాలు అందించాం. రామగుండంలో వీధి ఆవులు, దూడలను గుర్తించడం వైద్యం అందించడం కష్టంగా మారింది. వ్యాధి బారిన పడిన పశువులకు సంబంధించిన సమాచారం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇస్తుండటంతో వెంటనే చికిత్స అందించగలుగుతున్నాం. జిల్లావ్యాప్తంగా 3 అంబులెన్సులు సిద్ధం చేశాం. ఈ వ్యాధి పశువు నుంచి మనుషులకు సోకదు. వాటి పాలు తాగినా సంక్రమించదు. వైరస్ నియంత్రణకు గోట్‌పాక్స్ వ్యాక్సిన్ వేస్తున్నాం. వైరస్ సోకిన పశువు చుట్టుపక్కల 5 కిలోమీటర్ల వరకు రింగ్ వ్యాక్సిన్ రసాయన ద్రావణాలను పిచికారీ చేస్తాం. ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదు.రామస్వామి, పశుసంవర్ధక శాఖ అధికారి, రామగుండం

# ఆర్థిక స్థితి ఎలా ఉంది?



పెద్దపల్లి : సెర్ప్ ద్వారా స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేసుకున్న మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు బ్యాంకులు స్త్రీనిధి ద్వారా రుణాలు అందించేందుకు ముందుకు వచ్చాయి. రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించడంతో గ్రామాల్లో రూ.కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు కొనసాగుతున్నాయి. చిరు వ్యాపారాలతో ఆదాయాభివృద్ధి సాధిస్తూ ఆర్థికంగా మెరుగవుతున్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాదుల మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ఆధ్వర్యంలో ‘లక్పతి దీదీ’ కార్యక్రమం ద్వారా సభ్యుల ఆర్థిక, జీవనోపాధి అంశాలపై సభ్యురాలి వారీగా సర్వే చేపట్టారు. జిల్లాలో 565 గ్రామైక్య సంఘాలు ఉండగా 14,941 స్వశక్తి సంఘాల్లో 1,76,824 మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. జిల్లాలో గ్రామాల వారీగా ఆయా మండలాల్లో సామాజిక, ఆర్థిక, జీవనోపాధిపై సంఘాలు, సభ్యుల వారీగా వివరాలు సేకరిస్తున్నారు.జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్(ఎన్ఆర్ఎల్ఎం) ద్వారా దేశవ్యాప్తంగా ‘లక్పతి దీదీ’ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల స్థితిగతులను అంచనా వేస్తుంది. సంఘాలు జీవనోపాధిలోకి రాకముందు, తరువాత పరిస్థితులపై కుటుంబ ఆర్థిక సర్వే కొనసాగుతుంది. ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి ప్రభుత్వ పథకాలపై అవగాహన, వ్యాపారం ఎలా చేస్తున్నారు? గ్రామంలోని సంఘాలలోని సభ్యుల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. నైపుణ్యతకు కావాల్సిన అవసరాలు, ఏడాదిలో ఎంత ఆదాయం సమకూర్చుకుంటున్నారు, సభ్యురాలు సంఘంలో చేరకముందు చేసిన పని, ప్రస్తుతం చేస్తున్న పని వివరాలు తెలుసుకుంటున్నారు. ఆయా సభ్యురాలు నెల, ఆరునెలల వారీగా ఎంత సంపాదిస్తున్నారు అనే అంశంపై వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో సంఘ సభ్యురాలికి రూ.25 వేలకు మించి రుణం అందించకపోగా ప్రస్తుతం సంఘానికి రూ.లక్షల్లో అందిస్తున్నారు. 2011 కంటే ముందుగా కూలీగా పనులకు వెళుతుండగా, ప్రస్తుతం 2023 ఆర్థిక స్థితి మెరుగుపడిందని, వ్యాపారంతోపాటు జీవనోపాధిపై దృష్టి సారించినట్లు సర్వేలో కనిపిస్తుంది. వీటన్నింటి ద్వారా సభ్యురాలు ఆర్థికంగా మెరుగుపడినట్లు గుర్తిస్తున్నారు.

**మరింత అభివృద్ధి ఎలా సాధ్యం?**

సెర్ప్ రాకముందు మహిళల స్థితిగతులు ఎలా ఉన్నాయి? సంఘాలు ఏర్పాటు చేసుకున్న తరువాత కుటుంబాల పరిస్థితి ఎలా ఉంది? మళ్లీ వచ్చే అయిదేళ్లలో సభ్యులు ఎలాంటి వ్యాపారాలు చేసుకుంటారన్న దానిపై వివరాలు సేకరించనున్నారు. ఒకప్పుడు రుణం తీసుకుంటే తిరిగి చెల్లించలేని పరిస్థితి ఉంటే.. ప్రస్తుతం తిరిగి రుణాలు ఇచ్చే పరిస్థితికి ఎలా చేరుకున్నారు? ప్రస్తుతం అందిస్తున్న రుణాల వినియోగం, ఆదాయాభివృద్ధి ఎలా ఉంది.. జీవనోపాధి, జీవన స్థితిగతి ఎలా ఉందో సభ్యురాలి వారీగా వివరాలు సేకరిస్తున్నారు. సెర్ప్ ద్వారా రూ.20లక్షల వరకు రుణాలు అందిస్తుండగా రుణాలు పెంచాల్సిన అవసరముందా? ఏదైనా శిక్షణ ఇస్తే వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకునే వీలుందా? కుటుంబంలో పిల్లల చదువులు, ప్రభుత్వ సేవలు ఎలా ఉన్నాయి? నైపుణ్యం శిక్షణ అవసరమా? రాయితీ రుణాలు అందుతున్నాయా? వీటన్నింటి ఆధారంగా సంఘాల పటిష్ఠతకు చేపట్టాల్సిన చర్యలపై వివరాలు అడిగి తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

**ఆర్థికంగా మెరుగుపడ్డారు– లావణ్య, సంఘం నిర్వాహకురాలు**

గతంలో ఆర్థికంగా ఇబ్బంది పడ్డ మహిళా సంఘ సభ్యులు, ప్రస్తుతం తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మెరగుపడ్డారు. ఒకప్పుడు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రాకపోగా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తుండడంతో ప్రస్తుతం బ్యాంకులు పోటీ పడి రుణాలు అందిస్తున్నాయి. ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవడమే కాకుండా సామాజిక అంశాలపైనా మహిళలకు అవగాహన పెరిగింది.

**సంఘాలు బలోపేతం– వోడెల గంగాధర్, ఏపీఎం**

ప్రభుత్వ పథకాలు, రుణాలు సద్వినియోగం చేసుకోవడంతో సంఘాలు మరింత బలోపేతం కానున్నాయి. గతంలో కంటే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న నైపుణ్య, జీవనోపాధిలో వెనుకబడిన వారిని సర్వేలో గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించనున్నాం.

# అడ్డగోలుగా నిధులు దుర్వినియోగం

కోదాడ : ఉపాధిహామీ పథకం సిబ్బంది పనితీరు అధ్వానంగా తయారైంది. 2019 అక్టోబరు నుంచి 2022 మార్చివరకు నిర్వహించిన సామాజిక తనిఖీలో భారీగా నిధులు దుర్వినియోగం అయినట్లు వెల్లడైంది. 15రోజులపాటు గ్రామపంచాయతీల వారీగా సామాజిక తనిఖీలు జరిగాయి. విచారణ అనంతరం సుమారు రూ.16.50లక్షల వరకు నిధులు రికవరీకి అదనపు డీఆర్‌డీఓ శైలజ ఆదేశించారు. నిధుల దుర్వినియోగంపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై రూ.లక్ష 4వేలు అపరాధరుసుం విధించారు. గుర్రంపోడు మండలంలోని 37 గ్రామపంచాయితీల పరిధిలో నిర్వహించిన అభివృద్ధి పనుల్లో రూ.5,85,470లు, రాయితీపై వ్యక్తిగతమైన పనుల్లో రూ.7,01,179, సాంకేతిక సహాయకు(టీఏ)ల పరిధిలో రూ.1,85,311లు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. ఇందుకు వారికి రూ.57వేలు అపరాధరుసుము విధించారు. ఈసీల పరిధిలో రూ.54,528, కంప్యూటర్ ఆపరేటర్ పరిధిలో రూ19,330లు తప్పుగా లెక్కలు వెలుగు చూశాయి. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పరిధిలో రూ.72,553, గ్రామపంచాయతీ వర్కర్ల నుంచి రూ.22,035, క్షేత్రసహాయకుల రూ.8201లు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ఎవెన్యూ ప్లాంటేషన్లలో మొక్కల పెంపకంలో సుమారు రూ.7,01,179 విలువైన మొక్కలు కనిపించటంలేదని, తక్షణం వాటిని మళ్లీ పెంచాలని ఆదేశాలు జారీ చేశారు.

# రాదా.. భగీరథ!

కోదాడ : ఈ చిత్రంలో కనిపిస్తున్న వీధి అనంతగిరి మండలం వెంకట్రామాపురం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఉంది. ప్రభుత్వం ఇక్కడ ఒక్క ఇంటికి కూడా మిషన్ భగీరథ పైపులైన్ వేయలేదు. ఈ వీధులకు నీటి ట్యాంకు నిర్మాణం కూడా లేదు. ఇక్కడ నాలుగు వీధులకు ఒక్క బోరు మాత్రమే ఉంది. రెండు వీధులకు మాత్రమే ఆ బోరు నీళ్లు వస్తున్నాయి. మిగతా రెండు వీధుల్లో ఉన్న వారు మిగతా ఇళ్లలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకునే పరిస్థితి.గ్రామాల్లోని ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం అమలు చేస్తోంది. 2016 ఆగస్టు 7న రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మోదీతో దీనిని ప్రారంభించింది. ఒక్కో గ్రామ పంచాయతీకి సుమారు రూ.2 నుంచి 4 కోట్ల వరకు ఖర్చు చేసిన ప్రవేశపెట్టిన పథకం క్షేత్ర స్థాయిలో నిష్ప్రయోజనంగా మారింది. చాలా గ్రామాల్లోని కొన్ని ఇళ్లకు మిషన్ భగీరథ పైపులైన్లు వేయని పరిస్థితి. కొన్ని గ్రామాల్లో నీళ్లు వస్తున్న వాటికి పైపు లైన్ల లీకేజీల బెడద ఎక్కువైంది. కోదాడ పట్టణానికి రావాల్సిన 100 శాతం మిషన్ భగీరథ నీటిలో 30 శాతం నీళ్లు కూడా రావట్లేదు. దీంతో



వచ్చే కొన్ని నీటిని ఏ వార్డుకు పంపాలో తెలియక అధికారులు తలకిందులవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో సరిపడా నీళ్లు రావట్లేదని అధికారులు చెబుతున్నారు.

చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ వేసిన తర్వాత డ్రైనేజీ, సీసీ రహదారుల నిర్మించడంతో మిషన్ భగీరథ పైపులైన్లు ఎక్కడికక్కడ తెగిపోయాయి. సదరు రహదారి నిర్మాణ గుత్తేదారులు వాటికి మరమ్మతులు చేయలేదు. మిషన్ భగీరథ అధికారులు నిధులు లేవని చేతులెత్తేశారు. దీంతో చాలా గ్రామాల్లో ప్రతి ఇంటికి వేసిన నీటి కనెక్షన్లు తెగిపోవడంతో అధికారులు గ్రామ పంచాయతీ ట్యాంకుల ద్వారా నీళ్లను ఇస్తున్నారు. మిషన్ భగీరథ నల్లా ద్వారా పరిమిత పద్ధతిలో నీళ్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. కానీ గ్రామ పంచాయతీ నల్లా ద్వారా పరిమిత పద్ధతిలో నీళ్లు ఇవ్వడం కుదరదు. దీంతో క్షేత్ర స్థాయిలో నీటి ఎద్దడి ఏర్పడింది.

**గ్రామ పంచాయతీ నల్లా కనెక్షన్ల ద్వారా నీటిని ఇస్తున్నాం**

– పాపారావు, ఈఈ మిషన్ భగీరథ, సూర్యాపేట జిల్లా గ్రామాల్లోని కొంత మంది ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో గ్రామ పంచాయతీ కనెక్షన్ల ద్వారా నీటిని అందిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టినప్పుడు పైపు లైన్ల కనెక్షన్లు తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో నీరు రావడం లేదు. వేసవి కాలంలో నీటి విడుదలను పెంచాలని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

# కరగదీస్తూ.. కాజేస్తూ..!

నల్గొండ : నల్గొండ జిల్లా కేంద్రం నుంచి రూ.కోట్ల విలువైన ఖనిజ సంపద తరలిపోతోంది. నీలగిరి కొండలను కరగదీస్తూ ఎర్రమట్టి, సుద్దమొరం, రాతి గనులను కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. కాపాడాల్సిన అధికారులు పర్సంటేజీల పేరుతో జేబులు నింపుకుంటున్నారు. ఉన్నత స్థాయి అధికారులకు తెలిసినా నోరుమెదకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అభివృద్ధి పనుల మాటున సుమారు రూ.5 కోట్ల విలువైన భూగర్భ సంపదను దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని అన్వేశరమ్మ గుట్ట, దేవరకొండ రోడ్డులోని హౌసింగ్ బోర్డుకు చెందిన గుట్టల్లో తవ్వకాలు నిర్వహిస్తూ... ఎర్రమట్టి, సుద్ధమొరం అక్రమంగా తరలించుకుపోతున్నారు. రాత్రి సమయంలో పెద్ద వాహనాలు ఏర్పాటు చేసి నిత్యం రూ.లక్షల విలువైన ఖనిజ



సంపద అక్రమంగా తరలిపోతున్నా సంబంధిత అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. అక్రమ తవ్వకాలతో అన్వేశరమ్మ గుట్టపై ఏర్పాటు చేసిన మంచినీటి నిల్వ జలాశయం ప్రమాదం అంచున ఉంది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 600 గ్రామాలతో పాటు నల్గొండ మున్సిపాలిటీకి మంచినీటి సరఫరాలో ఉపద్రవం పొంచి ఉంది.

**కొల్లగొడుతున్న మట్టి మాఫియా**

జిల్లాలో రోడ్ల విస్తరణ, జాతీయ రహదారి నిర్మాణం, పై వంతెన నిర్మాణాలకు మొరం అవసరం ఉందంటూ రెండు గుత్తేదారు సంస్థలు 34 వేల మెట్రిక్ టన్నుల మట్టి తవ్వకునేందుకు అన్వేశరమ్మ చిన్నగుట్ట ప్రాంతంలో అనుమతి పొందారు. సదరు సంస్థలు మాత్రం అంతకు మూడింతలు అదనంగా తవ్వకాలు జరిపి మట్టిని తరలించుకుపోయినట్లు కనిపిస్తోంది. దేవరకొండ రోడ్డులో సైతం హౌసింగ్ బోర్డు ప్రాంతంలోని గుట్టలను కరగదీశారు. ఎలాంటి అనుమతి లేకుండానే సుమారు పది ఎకరాల్లో తవ్వకాలు జరిపి మట్టిని అక్రమంగా తరలించి బేబులు నింపుకుంటున్నారు. వీరికి తోడు భవన నిర్మాణదారులు, గుత్తేదారు సంస్థలు సైతం తవ్వకాలు చేస్తూ ప్రకృతిని సర్వనాశనం చేస్తున్నారు. నియంత్రించాల్సిన మున్సిపాలిటీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులు రాజకీయ నాయకులు ఒత్తిళ్లు, కాంట్రాక్టర్ల మామూళ్ల మత్తులో మునిగిపోతున్నారు.

**ఫిర్యాదులు చేస్తే చర్యలు:వెంకటేశ్వర్లు, ఏడీ మైనింగ్‌శాఖ నల్గొండ జిల్లా**

అక్రమంగా గుట్టలు తవ్వి మట్టి తరలించుకుపోయినట్లు మా దృష్టికి వచ్చింది. అభివృద్ధి పనుల కోసం అమ్మగూడం ప్రాంతంలో మాత్రమే అనుమతులు ఇచ్చాం. అన్వేశ్వరమ్మ, హౌసింగ్‌బోర్డు గుట్టలపై తవ్వకాలపై ఫిర్యాదులు చేస్తే విచారణ జరిపి కేసులు నమోదు చేస్తాం.

# కురిసిన వర్షం.. పంటలకు జీవం

జయశంకర్ : జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం పంటలకు జీవం పోసింది. జులై చివరి వారంలో కుండపోతగా కురిసిన వరుణుడు అనంతరం మొఖం చాటేయడంతో ఆగస్టులో లోటు వర్షపాతం నమోదైంది. జూన్, జులైలో విత్తుకున్న మొక్కలకు నీరు అందక పలుచోట్ల ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. బోరుబావులపై ఆధారపడిన రైతులు మిరప నారు నాటుకొని భూమిని తడుపుతూ మొక్కలను కాపాడుకుంటున్నారు. మరికొన్ని చోట్ల వర్షం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్‌లో వర్షాలు కురవకపోతే ఇక ఆశలు వదులుకోవాలని రైతులు భావిస్తున్న తరుణంలో వర్షం పడింది. దీంతో ఆదివారం పలుచోట్ల అన్నదాతలు ఆనందంతో వర్షంలోనే మిరప నార్లను



నాటుకున్నారు. అత్యధికంగా మల్హర్ మండలంలో 80.6 మి.మీల వర్షపాతం నమోదైంది. ఇలాగే ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే మొక్కలకు వేరు తెగులు వచ్చే అవకాశం ఉందని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

మూడు మండలాల్లో లోటు..

గత నెలలో వర్షాలు పడకపోవడంతో జిల్లాలోని 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో 25 మి.మీల కంటే తక్కువ వర్షపాతం నమోదై ఇంకా లోటుగానే ఉంది. మల్హర్, మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో 50 మి.మీల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

విరిగిన స్తంభం

మండలంలో భారీ వర్షం కురిసింది. దామెరకుంట ఒకటో వార్డులో తాటిచెట్టు విరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో స్తంభం నేలకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వాగుల్లోకి వరద

వరసగా రెండో రోజు భారీ వర్షం కురిసింది. వాగుల్లోకి వరద భారీగా వచ్చి చేరింది. వంతెనలపై నుంచి వరద ప్రవహించింది. 72.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# అన్నదాతలకు గుండెకోత!

జయశంకర్ :గోదావరి జలాలు ఎంతో మంది రైతులకు సాగునీరు.. ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుస్తున్నాయి.. కానీ, ఆ గోదావరినే నమ్ముకొని తీర ప్రాంతాల్లో జీవిస్తున్న వందలాది కుటుంబాలకు గుండె'కోత' మిగులుతోంది.. ఏటా గోదావరి ఉప్పొంగి తీర ప్రాంతాల్లో నష్టం వాటిల్లుతోంది. గోదావరి వరద తీవ్రతతో సాగు భూములు కోతకు గురవుతుండగా.. మరో వైపు పంటలు ముంపునకు గురవుతున్నాయి. క్రమంగా భూములు ప్రవాహాల్లో కలిసిపోతున్నాయి. దీంతో తీర ప్రాంతాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తీర ప్రాంతాల్లోని తీరం వెంట భూములకు ప్రమాదం పొంచి ఉంటోంది. జిల్లాలో కాటారం, మహదేవ్‌పూర్, పలిమెల మండలాల్లో ఈ తీవ్రత ఎక్కువగా ఉంది. గోదావరి వరదతో భూములు కోతకు గురవుతున్నాయి. కాటారం మండలం దామెరకుంట, విలాసాగర్, తదితర గ్రామాలు, మహదేవపూర్ మండలం పల్గుల, మద్దులపల్లి, కుంట్ల, బలిజపురం, తదితర గ్రామాలు, పలిమెల మండంలోని పలిమెల, పంకెన, లెంకలగడ్డ, తదితర గ్రామాల్లో తీవ్రత కనిపిస్తోంది. కొన్ని గ్రామాల్లో ప్రజలు నివాసం ఉండే వైపు కూడా గోదావరి దూసుకొస్తోంది. పెద్దఎత్తున వరదలొస్తే ఆయా తీరప్రాంత గ్రామాలకు పెనుముప్పు పొంచి ఉంది.

వాగుల ప్రవాహాల వెంట సైతం..

మల్హార్ మండలం మీదుగా వెళ్లి గోదావరిలో కలిసే మానేరు వాగు వెంట సైతం భూములు కోతకు గురవుతున్నాయి. అలాగే పలిమెల మండలంలోని సర్వాయిపేట సమీపంలోని వాగు వెంట పంట భూములు ప్రవాహంలో కలిసిపోతున్నాయి.

పంటల మునక..

గోదావరి వరదలతో దాదాపు నాలుగేళ్లుగా పంటలు ముంపునకు గురవుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వెనుక జలాలతో పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వాపోతున్నారు. మల్హార్, కాటారం, మహదేవపూర్, పలిమెల మండలాల్లో వెనుక జలాలు, దిగువకు విడుదల చేస్తున్న ప్రవాహంతో దాదాపు ఏటా వందలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

కరకట్టలే పరిష్కార మార్గం..

భూముల కోత, పంటల ముంపు నివారించాలంటే కరకట్టల నిర్మాణమే పరిష్కార మార్గమని నిపుణులు చెబుతున్నారు. నిర్మాణానికి భారీగా నిధులు కావాల్సి వస్తోంది. ప్రతిపాదనలు చేపడుతున్నా నిధులు మంజూరు చేయడంలో జాప్యమవుతోంది. ముంపు ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించాలని తీర ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.

ఏటా మునుగుతున్నాయి

గతంలో మా భూములు కోతకు గురయ్యాయి. ఇప్పుడేమో వరదల కారణంగా ఏటా పంటలు మునుగుతున్నాయి. పెట్టుబడులు పెట్టి నష్టపోతున్నాం.. తీర ప్రాంతాల్లో కరకట్టలు నిర్మించి పరిష్కారం చూపాలి..

పెరుక సురేశ్, లెంకలగడ్డ, పలిమెల మండలం

అరెకరం వరకు పోయింది..

గోదావరి తీర ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటాను. గోదావరి వరదలు రావడంతో భూములు ప్రవాహానికి కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే నా భూమి అరెకరం కోతకు గురైంది. మా గ్రామానికి చెందిన దాదాపు 20 మంది రైతులకు సంబంధించిన భూములు గోదావరిలో కలిసిపోతున్నాయి. పరిష్కార మార్గం చూపించాలి.

మానెం మహేశ్, పల్గుల, మహదేవపూర్ మండలం

ప్రతిపాదనలు పంపించాం..

కరకట్టల నిర్మాణానికి రూ.450 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లా పరిధిలో దాదాపు 30 కిలోమీటర్ల మేర కరకట్టల నిర్మాణం చేపడుతాం. నిధులు రావాల్సి ఉంది.

నల్లా వెంకటేశ్వర్లు, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ, రామగుండం,

# ఫలించిన నిరీక్షణ



వరంగల్ : బదిలీల, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల నిరీక్షణ ఫలించింది. సర్కారు సై అనడంతో ఉపాధ్యాయ సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. తొలుత వేసవి సెలవులకు ముందే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలనే ఉద్దేశంతో జనవరి నుంచి ఫిబ్రవరి వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఆ సమయంలో కోర్టుకు వెళ్లడంతో నిలిపివేశారు. ఎట్టకేలకు కోర్టు అనుమతితో ప్రభుత్వం సరే అంటూ విధివిధానాలను ప్రకటించింది. ఈ ప్రక్రియను కూడా నెల రోజుల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో ఆదివారం నుంచి 5వ తేదీ(మంగళవారం) వరకు అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు చేసుకోనున్నారు. ఆ దరఖాస్తు కాపీలను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి.

2,490 ఖాళీలు: ఉమ్మడి జిల్లాలో మంజూరైన పోస్టులు సుమారు 15,150 ఉన్నాయి. ప్రస్తుతం 12,660 మంది పనిచేస్తున్నారు. ఇంకా 2,490 ఖాళీలున్నాయి. వీటిలో 70 శాతం ప్రధానోపాధ్యాయులు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, ఎస్‌జీటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. మిగిలిన 30 శాతం ఖాళీలను డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తారు. సబ్జెక్టుల వారీగా ఎంత మందికి పదోన్నతి కలగనుంది అనేది అధికారులు అంచనాలు వేస్తున్నారు.

6,312 మంది దరఖాస్తు: గత ఏప్రిల్- మే నెలలో బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ప్రభుత్వం అందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఫిబ్రవరిలో దరఖాస్తులు స్వీకరించారు. ప్రక్రియ కొనసాగుతుండగానే కొందరు తమకు అన్యాయం జరుగుతోందని కోర్టును ఆశ్రయించడంతో అర్ధాంతరంగా ఆ ప్రక్రియ నిలిచింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో 6,312 మంది ఉపాధ్యాయులు బదిలీలకు, పదోన్నతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు గ్రీన్‌సిగ్నల్ రావడంతో గతంలో వచ్చిన దరఖాస్తులకు తోడుగా నిబంధనల ప్రకారం జనవరి నుంచి సెప్టెంబరు 1 నాటికి ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయుల సంఖ్య మరింత పెరగనుంది. జిల్లాల వారీగా విద్యాశాఖ అధికారులు అర్హులైన ఉపాధ్యాయుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

బదిలీలకు అర్హులెవరంటే..: బదిలీలకు మార్గదర్శకాలు 2023 సెప్టెంబరు 1 నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అర్హులు. ఇదే తేదీ నాటికి ఒకే పాఠశాలలో ఐదేళ్లు పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు తప్పనిసరిగా బదిలీ అవుతారు.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించి ఆన్‌లైన్‌లోనే గతంలో దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సవరణ చేసుకునేందుకు ఆప్షన్ ఇవ్వనున్నారు. కొత్త దరఖాస్తులను స్వీకరిస్తారు. పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టేందుకు ఈ విధానాన్ని ఎంచుకున్నారు. దరఖాస్తులు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో తమ ఎంప్లాయ్ ఐడి నెంబరు, ఆధార్‌కార్డు నెంబరు ఎంట్రీ చేసి సవరణలు చేసుకోవచ్చు. కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ తర్వాత దానిని ప్రింట్ తీసుకుని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి.

# లక్ష్యం నీరుగారుతోంది



వరంగల్ :ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా శుద్ధజలం అందించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం వరంగల్ మహానగరంలో నీరుగారుతోంది. అమృత్, అర్బన్ మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పనులు ఎవరికి వారే అన్నట్లు చేపట్టారు. ఆదరాబాదరగా ప్రధాన పైప్‌లైన్ వేసి చేతులు దులుపుకొన్నారు. పలుచోట్ల అసంపూర్తి పనులతో నీటి సరఫరా గతి తప్పింది. కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో ఎక్కడ చూసినా లీకేజీలే. దీంతో పలు డివిజన్లలో కొన్ని నెలలుగా కుళాయిల ద్వారా రంగు మారి, దుర్వాసనతో కూడిన నీరు వస్తుండటంతో ప్రజలు వాటిని తాగడానికి జంకుతున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా బల్దియా ఇంజినీరింగ్ అధికారులు స్పందించడం లేదు.

ఇదిగో పరిస్థితి ఇలా..కాజీపేట తారా గార్డెన్ వెనుకల కాలనీ, ప్రగతినగర్, ఎన్ఐటీ సమీప కాలనీ, దర్గారోడ్డులో నల్లాల ద్వారా కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. మూడు, నాలుగు వారాలవుతున్నా గ్రేటర్ ఇంజినీర్లు పట్టించుకోవడం లేదు. ఇద్దరు ఏఈలు మారడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. కమిషనర్ ఆదేశించిన కదలిక లేదు.

హనుమకొండ రెడ్డికాలనీ, కొత్తూరు జెండా, యాదవనగర్ కాలనీల్లో రంగు మారిన నీళ్లు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీల సమస్య ఉంది.

వరంగల్ 29వ డివిజన్ రామన్నపేట, పాపయ్యపేట కాలనీల్లో నల్లాల ద్వారా కలుషితమైన నీరు వస్తున్నాయని మహిళలు తెలిపారు.

28వ డివిజన్ హంటర్‌రోడ్, సంతోషిమాత కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌లలోనూ నల్లాల ద్వారా రంగు మారిన నీళ్లు వస్తున్నాయి.

అధికారిక లెక్కలే 350 లీకేజీలు..కాజీపేట, హనుమకొండ, వరంగల్ త్రినగరాల్లో 350కి పైగా లీకేజీలున్నట్లు ఇంజినీరింగ్ అధికారులేమ చెబుతున్నారు. ఒకవైపు మరమ్మతులు చేస్తుంటే.. మరోవైపు ఇంకోచోట పడుతున్నాయి. దీంతోనే తాగునీరు కలుషితం అవుతోందని గుర్తించారు. నగరంలోని 66 డివిజన్లలో లీకేజీలు అరికట్టడానికే ప్రత్యేకంగా కార్మికులను విధుల్లోకి తీసుకున్నా ఆశించిన ఫలితాలు లేవు. ఇటీవల వరదలతో సుమారు 45 కిలో మీటర్ల మేర పైపులైన్లు దెబ్బ తిన్నాయని గుర్తించారు. అందులో ఎక్కువగా హనుమకొండలోనే ఉన్నాయి. కొత్తగా వేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్లు కొట్టుకుపోయాయి.

నీటి సరఫరా ఇలా ఉంది..

హనుమకొండ వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్ జోన్ పరిధిలో 70 శాతం కాలనీలకు ప్రతిరోజు, మిగిలిన 30 శాతం కాలనీలకు రెండ్రోజులకు ఒకసారి నీటి సరఫరా అవుతోంది. కాజీపేట ప్రాంతంలో నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది.

హనుమకొండ కేయూసీ జోన్, వరంగల్ ప్రాంతం దేశాయిపేట జోన్ పరిధుల్లో 80 శాతం కాలనీలకు రోజూ నీటిని వదులుతున్నారు. మిగిలిన కాలనీలకు రోజు విడిచి రోజు ఇస్తున్నారు.

వరంగల్ అండర్ రైల్వేగేటు జోన్ పరిధిలో 90 శాతం కాలనీలకు రోజూ, 10 శాతం ప్రాంతాలకు దినం విడిచి దినం సరఫరా అవుతోంది. ఇక్కడ రోడ్ల నిర్మాణాల పేరుతో పైపులైన్లు తవ్వి వదిలేశారు. దీంతో లీకేజీలు ఎక్కువయ్యాయి.

నెలలో పదిరోజులే..వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని బొర్రయ్య గారి వీధిలో నల్లాల ద్వారా మొదట పది నిమిషాల పాటు మురుగు నీరు వస్తున్నాయని స్థానికుడు శ్రీనివాసాచార్య తెలిపారు. మిషన్ భగీరథ నల్ల కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో పాత పైప్‌లైన్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తున్నారు. నెలలో పది రోజులు కూడా సరఫరా చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 15 నిమిషాలు మాత్రమే వదులుతారని, అవి కూడా మొదట పది నిమిషాలు కలుషిత నీరే వస్తాయని చెప్పారు. బల్దియా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ పైప్‌లైన్ పూర్తిచేసి శుభ్రమైన నీటిని అందించాలని స్థానికులు కోరుతున్నారు. రోజూ కనీసం గంట పాటు సరఫరా చేయాలంటున్నారు.

వేళాపాళ లేదు..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాలనీలకు వేళాపాల లేకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. ఓసిటీ ట్యాంకు ద్వారా మూడ్రోజులుగా నీటి సరఫరా నిలచిపోయింది. మోటారు పాడవడంతో ఓసిటీ, క్రిస్టియన్‌కాలనీ, గాంధీనగర్, యాకుబ్‌పుర, ప్రతాప్‌నగర్ ప్రాంతాలకు నీటి సరఫరా లేదు. ఓసిటీ, సొసైటీ కాలనీ, ఎరుకలవాడ ట్యాంకుల నుంచి ఒక్కరే నీటిని సరఫరా చేస్తుండటం సమస్యగా మారింది. వరంగల్ వివేకానంద కళాశాల లైన్, లక్ష్మీపురం, చార్‌బౌళి ప్రధాన రహదారిలో కుళాయి నీళ్లు దుర్వాసనగా వస్తున్నాయి. ఎల్బీనగర్ తారకరామ వీధి, మొమిన్‌పుర, మగ్గాల గల్లీ ప్రాంతాలు ఎత్తులో ఉండటంతో సరిగా నీరందడం లేదు. ఎనుమాముల సాయిగణేశ్‌కాలనీ, బాలాజీకాలనీలో పైపులైన్ నిర్మాణంలో లోపాలున్నాయి.

# వల్మిడికి సొబగులు..

వరంగల్ : దక్షిణ అయోధ్యగా పేరొందిన వల్మిడి కొత్త సొబగులు అద్దుకుంది. వాల్మీకి మహర్షి తపమాచరించిన నేల (వాల్మీకిపురం).. ఆధ్యాత్మిక, పర్యాటక హారంగా సిద్ధమైంది. ఇక్కడి చారిత్రక రాముల గుట్టపై రామాలయంతో పాటు సుమారు 37 ఎకరాల స్థలంలో రూ.25 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈనెల 4న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పంచాయతీరాజ్‌శాఖ మంత్రి దయాకర్‌రావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ శివలింగయ్య నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు.

చారిత్రక నేపథ్యం

జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని వల్మిడికి ఎంతో చారిత్రక నేపథ్యం ఉంది. ప్రముఖ కవి వాల్మీకి మహర్షి నివాస స్థలంతో పాటు లవకుశుల జన్మస్థలంగా ఈ ప్రాంతం ప్రాచుర్యం పొందింది. ఇక్కడ రెండు గుట్టలు పక్కపక్కనే ఉండటం మరో విశేషం. ఒకటి మునుల గుట్ట, మరొకటి రాములగుట్ట. వాల్మీకి తపమాచరించిన గుట్టను మునులగుట్టగా, గుట్టపై ఉన్న పుష్కరిణిని మునుల గుండమని పిలుస్తారు. రాముల గుట్టపై శ్రీరామచంద్ర స్వామివారి పాలగుండం స్వయంగా వెలిసింది. శ్రీరామనవమి రోజు ఇక్కడ జరిగే స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అలాగే జీడిగుండంలో స్నానమాచరించి పాలగుండంలోని జలాన్ని శిరస్సుపై చల్లుకుంటే సకల పాపాలు హరిస్తాయని పండితులు, భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఈ ప్రాంతంలోని గుట్టలు ప్రాచుర్యంలోకి వచ్చాయి.సర్వాంగ సుందరంగా పరిసరాలువల్మిడి శివారులోని రాముల గుట్టపై నూతనంగా నిర్మించిన రామాలయ ప్రారంభోత్సవాలు, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం మొదలయ్యాయి.ప్రముఖ చిత్రకారుడు మల్లిక్ రామాలయ గోడలపై సీతారాముల చిత్రాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతిరోజూ రాత్రి కళాకారులు, విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. రాములగుట్టపై సోమవారం నిర్వహించనున్న రామాలయ, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన వేడుకలకు త్రిదండి చిన జీయర్‌స్వామి, మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్ రానున్నారు. ఆలయ ప్రారంభోత్సవంతోపాటు స్వామివార్ల కల్యాణ ఉత్సవంలో వారు పాల్గొంటారు.

# అభివృద్ధికి నోచుకోని 'బొగత'

వాజేడు : తెలంగాణ నయాగరాగా పేరొందిన బొగత జలపాతం అసౌకర్యాలకు నిలయంగా మారింది. అభివృద్ధి లేకపోవడంతో పర్యాటకులు అవస్థలు పడుతున్నారు. ప్రకృతి ఎంతో ఆనందాన్ని ఇస్తుండగా.. వసతుల లేమి వచ్చిన వారిని ఆలోచనలో పడేస్తున్నాయి. సందర్శకులకు డబ్బులు పెట్టి కొనుగోలు చేద్దామన్నా తాగునీరు దొరకని పరిస్థితి. విద్యుత్తు సరఫరా ఉన్నప్పటికీ దీపాలు ఏర్పాటు చేయడంలో అలసత్వం చూపిస్తున్నారు. ఇక్కడి సోలార్ దీపాలు మరమ్మతులకు గురై ఏళ్లు గడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదు.

ప్రమాదకరంగా జలపాతం పరిసరాలు

జలపాతాన్ని తిలకించే పర్యాటకులు ప్రమాదకరంగా ఉన్న రాతికట్టపైనే నిలబడుతున్నారు. ఈ ఏడాది వచ్చిన వరదలకు రాతికట్ట కూలిపో



యింది. నీటి కొలను చుట్టూ నిర్మించిన సిమెంటు స్తంభాలు కూలిపోయాయి. పిల్లలపార్కు పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి విషపురుగులకు నిలయంగా మారింది. రోప్ వే తెగిపోయినా పట్టించుకే వారే లేరు. ఊయల, తదితర ఆట వస్తువులన్నీ తుప్పుపట్టాయి. బట్టలు మార్చుకునే, మరగుదొడ్ల తలుపులు విరిగి ఉండటంతో దూర ప్రాంతాల నుంచి వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటనలకే పరిమితం

బొగత ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని పాలకుల మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. తిందామంటే తిండి లేక, నీరు లేక సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెస్టారెంట్ ఏర్పాటు చేస్తామని అటవీ అధికారులు ఆర్భాటంగా చెప్పినా.. అమలుకు నోచుకోలేదు. ఇక్కడి పరిస్థితిని తెలుసుకున్న పర్యాటకులు వంట సామగ్రి వెంట తెచ్చుకుని పార్కింగ్ ప్రదేశంలో వంటలు చేసుకుంటున్నారు. 'బొగత' సిబ్బందిది పర్యాటకుల పరిస్థితే.

# లేఅవుట్ల క్రమబద్ధీకరణకు కార్యాచరణ

కరీంనగర్ : అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. మూడేళ్ల కిందట వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేసేలా కార్యాచరణ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రామగుండం నగర పాలక సంస్థతోపాటు పురపాలికలు, కరీంనగర్ శాతవాహన, వేములవాడ పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఎల్ఆర్ఎస్-2020 పేరుతో దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం, న్యాయపరమైన అంశాలకు లోబడి అర్జీలు పరిశీలించేలా ముందుకొచ్చింది. మొత్తం 1,10,684 దరఖాస్తులు ఉండగా అందులో 827 తిరస్కరించగా, 65 మాత్రమే అనుమతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఫోన్ ద్వారా సమాచారం

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ప్లాట్లు, ఖాళీ స్థలాలు క్రమబద్ధీకరించుకోవడానికి ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి మాత్రమే కట్టారు. ఆ తర్వాత పురోగతి లేకపోవడం, అవసరమున్న వారు 14 శాతం ఫీజులు చెల్లించి భవన అనుమతులు తీసుకున్నారు. ఇలాంటి దరఖాస్తులు తిరస్కరిస్తుండగా, ఇంకా మిగిలినవి వేల సంఖ్యలో అర్జీలు ఉండగా ఫీజుల రూపంలో ఆదాయం రాబట్టుకోవడానికి ఆయా పుర, నగర పాలికల్లో వీటికి అనుమతులు ఇవ్వాలని ఉన్నతాధికారులు లక్ష్యాన్ని విధించినట్లు తెలుస్తోంది. నేరుగా దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు.మీసేవ దరఖాస్తులపై గందరగోళంఎల్ఆర్ఎస్ కోసం మీసేవలో ఆన్‌లైన్ చేసుకోగా వారి వివరాలు ఏవీ నగర, పురపాలికల్లో లేకుండా పోయాయి. వీరంతా ఆ సమయంలో ఎలాంటి పత్రాలు అందజేయకపో వడం, అందజేసిన కొందరు మీసేవ నిర్వాహకులు మాత్రం పురపాలికల్లో అప్పగించలేదు. ఒక్క కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే అయిదారు వేల దరఖాస్తుల సమాచారం లేకుండా పోయింది. వీరు చెల్లించిన రసీదు తీసుకొస్తే దాని నంబర్ ఆధారంగా వెతికి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

చెల్పూరు వాసికి..

హుజూరాబాద్ మండలంలోని చెల్పూరుకు చెందిన ఇ.రాంభాస్కర్ హనుమకొండ కాకతీయ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2013లో పదోన్నతిపై అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఆయన రాసిన వ్యాసాలు, మెటీరియల్‌కు గాను అవార్డుకు ఎంపికయ్యారు.హుజూరాబాద్ పట్టణం

# నిలిచిన మురుగు... పొంచి ఉన్న వ్యాధుల ముప్పు

గోదావరిఖని : వర్షాకాలంలో వాతావరణ మార్పులతో పాటు మురుగు దుర్గంధం, దోమలు, పందుల స్వైర విహారంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. గోదావరిఖని సప్తగిరి కాలనీలోని ఓ మహిళకు డెంగీ సోకినట్లుగా నిర్ధారణ అయింది. జనగామ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానికంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా ఏడాది క్రితం పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో ఓ బాలుడు(8), మరో పక్షం రోజుల తర్వాత సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు(36) విషజ్వరాలతో పక్షం రోజుల పాటు హైదరాబాద్, కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డారు. నగరంలోని ఏ కాలనీకి వెళ్లినా నిర్వహణకు నోచుకోని మురుగు కాలువలే దర్శనమిస్తున్నాయి. దోమలు, పందుల వృద్ధికి కారణమవుతూ విషజ్వరాలను వ్యాప్తి చేస్తున్నాయి. వర్షాకాలం ఆరంభానికంటే ముందుగానే నగరంలోని ప్రధాన, గల్లీల్లోని మురుగు కాలువలను శుభ్రం చేసేవారు. ఈసారి నగరపాలిక ఆ విషయాన్ని విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరంలోని ఖాళీ ప్రదేశాల్లో మురుగు, వరదనీరు చేరుతోంది. పలుచోట్ల పైపులైన్ల లీకేజీతో తాగునీరు కలుషితమవుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే నివారణ ఎవరికి వారుగా తమ పరిసరాలతో పాటు ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే విషజ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు. ఇంటి ఆవరణలోని పాత టైర్లు, కొబ్బరి బొండాలు, వినియోగంలో లేని కూలర్లు, పాత పాత్రల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు వృద్ధి చెందుతాయి. ఇందులో వృద్ధి చెందే ఎడిస్ దోమ డెంగీ జ్వరాలకు కారణమవుతోంది. ఈ దోమ కుట్టిన వారంలో జ్వరం, కళ్లు మండటం, ఎముకలు, కండరాల్లో తీవ్రమైన నొప్పులు, వాంతులు తదితర లక్షణాలు ప్రబలుతాయి. వర్షాకాలంలో సాధారణంగా డయేరియా, కలరా, టైఫాయిడ్ ప్రబలుతుంటాయి. ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుతుండడంతో చాలా మంది బాధితులు ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రధానంగా నీటి కాలుష్యం, ఆహారంపై ఈగలు, దోమలు వాలడం ద్వారా ఆయా వ్యాధులు ప్రబలే ప్రమాదముంది. వేడి వేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించడం, కాచి చల్లార్చిన నీటిని తాగడం, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో పాటు దోమల బారిన పడకుండా తెరలను వాడాలని వైద్యులు సూచిస్తున్నారు.

# చెరువుల్లోకి చేపపిల్లలు

కొత్తగూడెం : మత్స్యకారుల అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ముగ్గురు పాల్గొనగా ఇద్దరు అర్హత సాధించారు. జిల్లాలో చెరువుల్లో చేపపిల్లలను పోసే కార్యక్రమాన్ని ఆగస్టు 26న ప్రారంభించారు. మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలోని చెరువులతో పాటు చర్ల మండలం తాలిపేరు, అశ్వారావుపేట మండలం పెద్దవాగు, అశ్వాపురం చెరువు రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదలనున్నారు.

743 చెరువులు.. 1.77 కోట్ల పిల్లలు

జిల్లాలోని 59 మత్స్య సహకార సంఘాల్లో 2,963 కుటుంబాలకు చెందిన వారు సభ్యులుగా నమోదై ఉన్నారు. వీరితో పాటు పరోక్షంగా అనేక కుటుంబాలు ఉపాధి పొందనున్నాయి. ఈ ఏడాది జిల్లాలోని 743 చెరువుల్లో 1,77,45,900 చేపపిల్లలను వదలాలని అధికారులు నిర్ణయించారు. పెద్ద పరిమాణంలోని 80 చెరువుల్లో 80- 100 మిల్లీమీటర్ల పరిమాణం చేపపిల్లలను పోస్తారు. చిన్న చెరువుల్లో 35-40 మి.మీ పరిమాణం చేపపిల్లలను వదిలేందుకు చర్యలు చేపట్టారు. పది చెరువుల్లో 2.08లక్షల రొయ్యలను పోయనున్నారు.

'మత్స్య మిత్ర'తో అక్రమాలకు చెక్

గతేడాది రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపపిల్లల సరఫరాలో



అవకతవకలు జరిగిన నేపథ్యంలో ఈసారి పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 'మత్స్య మిత్ర' యాప్‌ను తీసుకొచ్చింది. చేపపిల్లలను తెచ్చిన వాహనం, దాని నంబరు, ఎన్ని పిల్లలు తెచ్చిందనే వీడియో తీసి యాప్‌లో నిక్షిప్తపరుస్తారు. సరఫరాకు సంబంధించిన ప్రతి అంశాన్ని యాప్ ద్వారా మత్స్యశాఖ కమిషనర్‌కు చేరవేస్తారు. ఈ విధానం ద్వారా ప్రక్రియ అంతా పారదర్శకంగా జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

నాలుగు రకాలు

చెరువుల పరిమాణం, పరిస్థితులను బట్టి నాలుగు రకాల చేపలను మత్స్య సహకార సంఘాలకు అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. బొచ్చె, రవ్వ, మిరగ, బంగారుతీగ రకాలు ఉంటాయన్నారు. పెద్ద చెరువులకు బొచ్చ, రవ్వ, చిన్న చెరువుల్లో వదిలేందుకు మిరగ, బంగారుతీగ చేపపిల్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

# అంజనాపురంలో ఆయిల్‌పామ్ కర్మాగారం

ఖమ్మం : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలోని అంజనాపురం వద్ద ఆయిల్‌పామ్ కర్మాగారం త్వరలో ఏర్పాటు కానుంది. గోద్రెజ్ ఆగ్రోవిట్ కంపెనీ ఆధ్వర్యంలో సుమారు రూ.250 కోట్ల పెట్టుబడితో దీన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం మొత్తం 150 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటికే సర్వే నెం.111లో 126 ఎకరాలు సేకరించారు. ఇందుకోసం రూ.30 కోట్లను కంపెనీ ప్రభుత్వానికి చెల్లించింది. ఇంకా అవసరమైతే భూమి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉంది. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. కొద్ది రోజుల్లోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యం

ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి అనసూయతో పాటు జిల్లా ల్యాండ్ సర్వే, పరిశ్రమల అధికారులు కంపెనీ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. గంటలకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల కంపెనీని తొలుత ఏర్పాటు చేస్తున్నారు. తర్వాత అవసరాలను బట్టి గంటకు 60 మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి పెంచుకునే అవకాశం ఉంది.

సాగు పెంచేందుకు సన్నాహం

ప్రస్తుతం గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో కొణిజర్ల, వైరా, ఖమ్మం అర్బన్, ఖమ్మం గ్రామీణం, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం 3 వేల ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మరో 2 వేల ఎకరాల సాగు లక్ష్యంగా నిర్ణయించారు. కంపెనీ సామర్థ్యం 15 వేల




ఎకరాల వరకు ఉంది. రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం కంపెనీ అవసరాల మేరకు పెంచేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే కంపెనీకి అనుబంధంగా సమీపంలో లక్షా 5 వేల మొక్కలతో నర్సరీ ఉంది. దీనికి అనుబంధంగా కంపెనీ పక్కనే మదర్ సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేయనున్నారు. కర్మాగారంలో ముడి చమురును తయారు చేసి శుద్ధి చేసేందుకు హైదరాబాద్‌కు పంపుతారు.

సమీప రైతులకు ఉపయోగం...

ఏన్కూరు, కొణిజర్ల మండలాలకు సరిహద్దులో కర్మాగారం ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రైతులు పండించిన ఆయిల్‌పామ్ గెలలను సమీపంలోనే విక్రయించుకునే అవకాశం ఉన్నందున రైతులకు రవాణా ఖర్చులు తగ్గనున్నాయి. కొన్నేళ్ల నుంచి గోద్రెజ్ కంపెనీ ఈ ప్రాంతంలోని రైతులతో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయిస్తూ వారిలో నమ్మకం కలిగిస్తోంది. రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు అంజనాపురం సమీపంలోనే ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి రైతులకు సహకరిస్తోంది.

# తరగతులే కాదు.. జీవిత పాఠాలూ నేర్పిస్తారు..



ఖమ్మం : ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు సంబంధిత యంత్ర విద్యలో శిక్షణ ఇవ్వడంతోపాటు జీవితంపై సమగ్ర దృక్పథాన్ని పెంచి పని చేయాలనే కోరికను రగిలించేందుకు కసరత్తు చేస్తున్నాయి. విద్యార్థి తాను ఎంచుకున్న విభాగంలో అద్భుతమైన జ్ఞానం, నైపుణ్యాలను పెంచుకొని, సమాజం, సంబంధాల గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇంజినీరుగా, పౌరుడిగా బాధ్యతలు సక్రమంగా నెరవేర్చేలా కళాశాలలు తర్ఫీదు ఇస్తున్నాయి.

వారం రోజుల ముందు...

ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. సెప్టెంబరు 4 నుంచి మొదటి సంవత్సరం యంత్ర విద్య విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నట్లు జేఎన్‌టీయూహెచ్ ప్రకటించింది. తరగతుల ప్రారంభానికి ముందు వారం పాటు 'స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం'(అవగాహన) తరగతులు తప్పని సరిగా నిర్వహించాలని ఏఐసీటీఈ అన్ని విశ్వవిద్యాలయాలకు, కళాశాలలకు ఆదేశించింది. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల రాకతో కళాశాలల్లో సందడి మొదలైంది. ఖమ్మం గ్రామీణ మండలంలోని బారుగూడెం మహ్మదీయ కళాశాలలో కొత్తగా జేఎన్‌టీయూహెచ్-పాలేరు ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించడంతో విద్యార్థులకు భవనాల సమస్య తొలగింది.

ప్రధాన ఉద్దేశం ఇదే...

నూతన విద్యార్థులు, కొత్త వాతావరణంలో ఉల్లాసంగా ఉండేలా చేయడం, వారిలో కళాశాల పద్ధతులు, విలువలు, సంస్కృతిని పెంపొందించటం, ఇతర విద్యార్థులు, అధ్యాపకులతో సంబంధాలు ఏర్పరచుకోవడం, భవిష్యత్తు కోసం స్వీయ అన్వేషణ విధానాన్ని అవలంబించేలా ప్రోత్సహించటం.

కార్యకలాపాలు ఇలా...శారీరక కార్యాచరణలు, సృజనాత్మక కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మెంటారింగ్, మానవ విలువలపై అవగాహన, సంబంధిత విభాగాల సందర్శన, సాహిత్య కార్యకలాపాలు, నైపుణ్య సంబంధిత అంశాలు, ప్రముఖ వ్యక్తుల ఉపన్యాసాలు, కార్యశాలలు, ప్రాంతీయ ప్రముఖ ప్రాంత సందర్శనలు, కళాశాలలో పాఠ్యేతర కార్యకలాపాలు, కార్యక్రమాలపై అభిప్రాయాల సేకరణ, నివేదిక.

# సారథిలేక.. గాడితప్పుతున్న విద్యాశాఖ



కొత్తగూడెం : విద్యా శాఖలో కీలకమైన జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ), అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన, 'మన ఊరు - మన బడి/మన బస్తీ' పనుల పర్యవేక్షణ, 'తొలిమెట్టు', 'ఉన్నతి', 'లక్ష్య' వంటి ముఖ్య కార్యక్రమాల కొనసాగింపు జిల్లా వైద్య శాఖాధికారితో ముడిపడి ఉంటుంది. కానీ కీలక బాధ్యతలను ఖమ్మం జిల్లా డీఈఓ సోమశేఖర్‌శర్మకు అదనంగా అప్పగించారు. రెండు జిల్లాల బాధ్యతల కారణంగా సదరు అధికారి వారానికి రెండు, మూడు రోజులకు మించి భద్రాద్రి జిల్లాకు సమయం కేటాయించలేకపోతున్నారు. ఫలితంగా జిల్లా విద్యాశాఖ పాలన గాడి తప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో విద్యా రంగంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొరవడింది. తాజాగా కొనసాగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, ఈ నెల 15న 'టెట్' నిర్వహణకు ఏర్పాట్లు ఎలా చేయాలా? అని అధికారులు, ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. రెగ్యులర్ డీఈఓ, ఏడీ పోస్టులు ఇకనైనా భర్తీ చేయాలని ఆ శాఖ ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్యక్రమాల అమలుపై ప్రభావం

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,375 కొనసాగుతున్నాయి. వాటిల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 71,840 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇవికాక 14 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఆరు నుంచి ఇంటర్మీడియట్ వరకు మరో 4 వేల మంది బాలికలు చదువుకుంటున్నారు. రెగ్యులర్ డీఈఓ, ఏడీ పోస్టులు లేక ఆయా విద్యాలయాలపై పర్యవేక్షణ కొరవడింది. విద్యాశాఖ కార్యాలయంలోనూ తరచూ ఏదో ఒక వివాదం తెరపైకి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులోనూ క్షేత్రస్థాయిలో కొంత జాప్యం తలెత్తుతోందని తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తిగా డీఈఓ పర్యవేక్షణలోనే కొనసాగించాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు కొనసాగుతున్న సోమశేఖర్‌శర్మ ఖమ్మం బాధ్యతలూ చూడాల్సి ఉంది. ఆయన సక్రమంగా అందుబాటులో లేకపోతే తిప్పలు తప్పవని కార్యాలయ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ డీఈఓ నియామకం అంశం జిల్లా ఉన్నతాధికారుల పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. 2023, జనవరి నెలలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల సమయంలో హైదరాబాద్ నుంచి డీఈఓగా వచ్చిన ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్ నెలరోజుల పాటు బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత అనారోగ్యం కారణంగా ఆయన తిరిగి వెళ్లిపోయారు. జిల్లా విద్యాశాఖాధికారి నియామకం చేటపట్టాలని ఉపాధ్యాయ, విద్యా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రెండుచోట్లా విధులతో ఒత్తిడి

సోమశేఖర్‌శర్మ, డీఈఓ, ఉమ్మడి ఖమ్మం జిల్లా

రెండు జిల్లాల్లో బాధ్యతలు నిర్వర్తించడం కాస్త ఒత్తిడితో కూడుకున్న అంశమే. పాఠశాలల పర్యవేక్షణకు తోడు ఉభయ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్రస్థాయి అధికారుల సమీక్షలకు విధిగా హాజరుకావాల్సి వస్తోంది. ప్రస్తుత బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ రెండు చోట్లా కచ్చితంగా అందుబాటులో ఉండాలి. ఈ నేపథ్యంలో భద్రాద్రి జిల్లాకు రెగ్యులర్ అధికారిని నియమిస్తే ప్రయోజనం ఉంటుంది. ఏడీ పోస్టు సైతం రెండేళ్లుగా ఖాళీగా ఉంది.

# సంపూర్ణ ఆరోగ్యమే సైనికుడి బలం

ఖమ్మం :భారత సైన్యంలో చోటు సంపాదించడమంటే మాటలు కాదు.. దేశ భద్రత వీరిపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు గుండెలపై చేయి వేసుకొని నిద్ర పోతున్నారంటే సరిహద్దుల్లో సైన్యం అప్రమత్తంగా ఉండటం వల్లనే.. ఇటువంటి సైనికుల ఎంపికలు ఆషామాషీగా ఉండవు.. కఠిన నిబంధనలు, ఆరోగ్య పరీక్షలు దాటుకొని వెళ్తేనే సైన్యంలో చేరే అవకాశం దక్కుతుంది. ఖమ్మం సర్దార్ పటేల్, ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ మైదానాల్లో జరుగుతున్న అగ్నివీర్ ఎంపికల్లో అభ్యర్థుల ఆరోగ్య పరీక్షలు వివిధ అంచెల్లో నిర్వహిస్తున్నారు. తొలి దశ రాత పరీక్షలో మేథస్సుని.. రెండో దశ వ్యాయామ, వైద్య పరీక్షల్లో సంపూర్ణ ఆరోగ్య, దృఢత్వ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అర్హులు 350 మంది

జరిగిన అగ్నివీర్ ఎంపికల్లో 350 మంది అభ్యర్థులు వైద్య పరీక్షకు అర్హత సాధించారు. మొత్తం 1200 మంది నమోదు కాగా 925 మంది వ్యాయామ పరీక్షల్లో పాల్గొన్నారు.

తగ్గిన వసతి కేంద్రం

అగ్నివీర్ కోసం వస్తున్న వారి కోసం టీటీడీసీ(సాంకేతిక శిక్షణ కేంద్రం), అంబేద్కర్ భవన్, గిరిజన భవన్ మూడు చోట్ల వసతి ఏర్పాట్లు ఉండగా ఆదివారం అంబేద్కర్ భవన్‌కు వచ్చిన వారిని టీటీడీసీ భవనానికి పంపారు. నెలల ముందుగానే ఓ వివాహం కోసం అంబేద్కర్ హాలును బుక్ చేసుకున్నందున ఈ మార్పు జరిగిందని సోమవారం నుంచి ఇక్కడ వసతి అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

తల వెంట్రుకల నుంచి కాలి గోటి వరకు...

వైద్య పరీక్షలకు వచ్చిన అభ్యర్థి తల వెంట్రుకల నుంచి కాలి గోటి వరకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఏ మాత్రం తేడా ఉన్నా తిరస్కరిస్తున్నారు. బట్టతల ఉన్నా, కంటి చూపు స్పష్టత లేకున్నా, రెండు చేతులు పైకి ఎత్తినప్పుడు సమంగా లేకున్నా, మోచేతులు దగ్గరకు వచ్చినా, గాలి పీల్చినప్పుడు శ్వాస సక్రమంగా లేకున్నా, పొట్ట భాగంలో సమస్యలు కనిపించినా, నిలబడినప్పుడు రెండు తొడ కండరాలు కలిసినా, మోకాళ్లు దగ్గరకు వచ్చినా, దొడ్డకాళు ఉన్నా, అరికాలి పాదాలు సమంగా ఉన్నా తిరస్కరణకు గురవుతున్నారు. వెయ్యి మందికి పైగా అభ్యర్థులు ఎంపికల్లో పాల్గొంటున్నప్పటికీ 30 నుంచి 50 శాతం మంది పీటీ(ఫిజికల్ టెస్టు) దాటుతున్నారు. ఇందులో కొందరు వైద్య పరీక్షల్లో తిరస్కరణకు



గురవుతున్నారు. చురుకైన పూర్తిస్థాయి ఆరోగ్యవంతులే చివరి పరీక్ష వరకు నిలిచి ఉంటున్నారు.

వ్యాధులున్నాయా..

ముందుగా రక్తపోటు, ఇతర ఆరోగ్య సమస్యలపై నిర్ధారణకు వస్తున్నారు. ముఖ్యంగా మొలల సమస్యలేమైనా ఉన్నాయా అనే కోణంలోనూ పరీక్షలు చేస్తున్నారు.

టాటూ ఉంటే టాటా...

శరీరంపై పచ్చబొట్టు(టాటు) ఉంటే ప్రాథమిక దశలోనే వెనక్కు పంపిస్తున్నారు. టాటూ అనేది సైనిక నిబంధనలకు పూర్తి విరుద్ధం. ఈ విషయం ఓ సైనికాధికారి వద్ద ప్రస్తావించగా టాటూ వేసేందుకు ఉపయోగించే పదార్థాలు క్రమంగా చర్మం లోపలికి చేరతాయి. కొన్నాళ్లకు చర్మవ్యాధులు ప్రారంభం అవుతాయి. అతని మానసిక స్థితి సక్రమంగా ఉండదు అనే వైద్య సలహాల మేరకే సైన్యం ఇలాంటి వారిని దూరంగా ఉంచుతోందని చెప్పారు.

# అక్రమాలకు కూపన్..!

మధిర : నదుల్లో ఇసుక తోడేళ్లకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. మధిర నియోజకవర్గంలోని మూడు నదుల నుంచి సమీప పట్టణాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారు. వాహనాలను సీజ్ చేసి జరిమానా విధిస్తునారు. తర్వాత అంతా షరా మామూలే అవుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరి విమర్శల పాలవుతోంది.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పదిహేను యూనిట్లు స్లాబు ఉన్న ఇంటి నిర్మాణానికి దాదాపు 65 నుంచి 70 ట్రక్కుల ఇసుక అవసరం ఉంటుంది. అంటే, ఒక్కో ట్రక్కుకు కూపన్ కింద రూ.1060 చెల్లించి ఇసుకను వినియోగించుకోవాలి. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఒక కూపన్ కింద ఒకటి కంటే ఎక్కువ ట్రక్కుల ఇసుక తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని ఎర్రుపాలెం, బోనకల్లు, చింతకాని, ముదిగొండ మండల కేంద్రాల్లో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ఇసుకకు భారీగా డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయం పెరగాల్సింది పోయి.. రూ.కోటికి పైగానే గండిపడుతోందని అంచనా.

ఇసుక తవ్వకాలు.. తరలింపు ఇలా..

మున్నేరు.. నియోజకవర్గంలో కట్లేరు, వైరానది, మున్నేరు నదుల్లో ఇసుక లభ్యత ఉంది. మున్నేరు నుంచి గంధసిరి, చిన్నమండవ రేవు ద్వారా ప్రతి రోజు 20 నుంచి 30 ట్రాక్టర్ ట్రక్కులు అక్రమంగా తరలిస్తున్నట్లు అంచనా. ఖమ్మం, నేలకొండపల్లి తదితర ప్రాంతాలకూ



వాహనాలు వెళ్తున్నాయి.

కట్లేరు.. ఎర్రుపాలెం మండలం కట్లేరు నుంచి రామన్నపాలెం, తక్కెళ్లపాడు, సఖినవీడు, రాజులదేవరపాడు గ్రామాల నుంచి ఇసుక దర్జాగా దాటిస్తున్నారు. చొప్పకట్లపాలెం రేవు నుంచి అక్కడి ప్రజాప్రతినిధి చొరవ తీసుకోవడంతో అక్రమ రవాణా కొంత ఆగింది.

వైరా నది.. మధిర మండలం వైరానది నుంచి రాయపట్నం, నక్కలగరబు, బయ్యారం, రేవుల నుంచి రవాణా అవుతోంది. ఇక్కడి నుంచి ఖమ్మం, వైరా ప్రాంతాలకు తరలిస్తున్నారు. బోనకల్లు మండలం కలకోట, మోటమర్రి రేవుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు.

అక్రమ రవాణాను అడ్డుకుంటాంజి.సంజయ్, మైనింగ్ ఏడీ

జీవోఎంఎస్ నం.3 మేరకు నదుల్లో ఇసుక అక్రమ రవాణాను నివారించే అధికారం స్థానిక తహసీల్దార్, ఎస్‌హెచ్‌వోలకు ఉంటుంది. వారే పర్యవేక్షించాల్సి ఉంది. త్వరలో అయిదు మండలాల స్థాయిలో తహసీల్దార్లు, ఎస్‌హెచ్‌వోలతో కలెక్టర్ ఆదేశం మేరకు సమావేశం ఏర్పాటు చేస్తాం. ఇసుక అక్రమ రవాణాను నివారించేందుకు చర్యలు తీసుకుంటాం. కూపన్ల ద్వారా మాత్రమే ఇసుకను స్థానికంగా ఇస్తున్నారు. అలా కాకుండా ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు.

# ప్రత్యేక శిబిరంలో.. 19,459 దరఖాస్తులు

ఖమ్మం : శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఓటుహక్కు నమోదు కోసం దరఖాస్తు (ఫాం-6) చేసుకోవడంతో పాటు, ఓటు తొలగింపు(ఫాం-7), వివరాల సవరణ(ఫాం-8)కు దరఖాస్తు చేసే గడువు ఈ నెల 19తో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 26, 27, సెప్టెంబరు 2, 3 తేదీల్లో బూత్ స్థాయిలో నాలుగు రోజులు ప్రత్యేక శిబిరాల్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాం-6లు 12,086, ఫాం-7లు 3,044, ఫాం-8లు 4,329 కలిపి.. మొత్తం 19,459 దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు.

ఓటు నమోదుపై విస్తృత ప్రచారంగ్రామాల్లో చెత్త సేకరించే వాహనాల సాయంతో ప్రత్యేక ఓటరు నమోదు గురించి విస్తృత ప్రచారం చేయాలని, ఓటు నమోదు నిర్వహించే చోట బ్యానర్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశించారు. ముదిగొండ మండలంలోని ముదిగొండ, మేడేపల్లి, యడవల్లిలో కలెక్టర్ పర్యటించారు. ఓటరు నమోదు శిబిరాల్ని పరిశీలించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఎన్ని ఫారాలు స్వీకరించారనే విషయాలను బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక వీఐపీ, వీవీఐపీల పేర్లు జాబితాలో ఉన్నదీ లేనిదీ సరిచూడాలన్నారు. కొత్త బీఎల్‌వోలకు శిక్షణలు ఏర్పాటు చేయాలన్నారు. మేడేపల్లి, యడవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో 'మన ఊరు-మనబడి' పనులను పరిశీలించారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సర్పంచి సామినేని రమేశ్, తహసీల్దార్ రామారావు పాల్గొన్నారు.

# చిన్నారి అవయవ దానంతో ఆరుగురికి పునర్జన్మ

మహబూబాబాద్ : తాను మరణిస్తూ ఓ చిన్నారి మరో ఆరుగురికి పునర్జన్మనిచ్చి ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. హనుమకొండ నివాసి లిక్కి అక్షర (13) అపార్ట్‌మెంట్ పైనుంచి కిందపడి గత నెల 26న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెత్ కాగా, తల్లిదండ్రులు శంకర్, స్వప్నల సహకారంతో కాలేయం, ఊపిరితిత్తులు, కిడ్నీలు, పాంక్రియాసిస్ దానం చేశారు. వాటిని ఆరుగురికి అమర్చడం



తో వారికి పునర్జన్మనిచ్చినట్లు అయిందన్నారు. జీవన్‌దాన్, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో చిన్నారి నివాసంలోనే సంస్మరణ సభ నిర్వహించారు. కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ అవయవదాన సర్టిఫికెట్ను బాలిక తల్లిదండ్రులకు అందించి సత్కరించారు. సంఘం ప్రతినిధులు సంజీవ్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, అనంతుల కేదారి పాల్గొన్నారు.

# స్వచ్ఛమేవ జయతే..

ఖమ్మం : పాఠశాలల్లో ఆహ్లాద, ఆరోగ్య వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఉత్తమ కార్యచరణ కనబరిచిన వాటిని 'స్వచ్ఛ విద్యాలయ పురస్కార్'కు ఎంపిక చేస్తుంది. 2022 సంవత్సరానికి ఈ అవార్డుల కోసం 1,512 విద్యాసంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. వీటన్నింటినీ ప్రత్యేక బృందాలు పరిశీలించి గ్రామీణ ప్రాంతాల్లో 23, పట్టణ ప్రాంతాల్లో 14 విద్యాసంస్థలను జిల్లా స్థాయి పురస్కారాలకు ఎంపిక చేసింది.

సబ్ కేటగిరీ అవార్డుకు ఎంపికైనవి..

ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు బీసీ కాలనీ ఎంపీపీఎస్. వైరా మండలం గండగలపాడు ఎంపీయూపీఎస్, గోల్లపాడు ఎంపీపీఎస్, పుణ్యపురం ఎంపీయూపీఎస్, తల్లాడ మండలం నిమ్మగూడెం ఎంపీపీఎస్, అన్నారుగూడెం ఎంపీపీఎస్, సింగరేణి మండలం కారేపల్లి టీఎస్ఎంఎస్, సత్తుపల్లి మండలం అయ్యగారిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రఘునాథపాలెం మండలం చింతగుర్తి ఎంపీయూపీఎస్, పెనుబల్లి మండలం మర్లకుంట ఎంపీయూపీఎస్, కేఎం వారి బంజర ఎంపీయూపీఎస్, చింతగూడెం జడ్పీహెచ్ఎస్, ముదిగొండ మండలం మేడేపల్లి జడ్పీహెచ్ఎస్, మధిర ఎంఆర్ టీవీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కూసుమంచి జడ్పీహెచ్ఎస్, పాలేరు ఎంపీయూపీఎస్, కొణిజర్ల మండలం పల్లిపాడు ఎంపీపీఎస్, పెద్దమునగాల ఎంపీపీఎస్, ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురం ఎంపీపీఎస్, టేకులపల్లి ఎంపీపీ



ఎస్, గాంధీనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హార్వెస్ట్ స్కూల్(సీబీఎస్ఈ), గట్టయ్యసెంటర్ కృష్ణవేణి స్కూల్, నయాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాయల్‌కిడ్స్ స్కూల్, ఖమ్మం గ్రామీణం కొత్తూరు కేజీబీవీ, కల్లూరు మండలం నారాయణపురం ఎంపీపీఎస్, ఏన్కూరు టీఎస్ఆర్ఈఐఎస్, చింతకాని మండలం అనంతసాగర్ ఎంపీపీఎస్.

జిల్లాలో ప్రధాన కేటగిరీ అవార్డు పొందిన పాఠశాలలు

వైరా మండలం రెబ్బవరం ఎస్సీ కాలనీలోని ఎంపీపీఎస్ (రెబ్బవరం), తల్లాడ మండలం మల్లారం ఎంపీపీఎస్, అన్నారుగూడెం జడ్పీహెచ్ఎస్, సత్తుపల్లిలోని టెట్రీస్(బాలురు), బేతుపల్లి గంగారంలోని ఎస్‌డీవీఆర్ జడ్పీహెచ్ఎస్, నేలకొండపల్లి మండలం సింగిరెడ్డిపాలెం ఎంపీపీఎస్, ఖమ్మం అర్బన్ మండల కొత్తగూడెం ఎంపీపీఎస్, కల్లూరు మండలం చినకోరుకొండి జడ్పీహెచ్ఎస్.

చక్కటి పురోగతి: సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మం

ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రత్యేక ప్రశంస లభించింది. రాష్ట్రస్థాయి అవార్డు కోసం ఈపాఠశాల నామినేట్ కాగా త్రుటిలో అవకాశం తప్పిపోయింది. ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చొరవ, స్థానికుల సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు శుద్ధ జలం అందిస్తున్నారు. వర్షం నీటి సమర్థ వినియోగం, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థుల ప్రవర్తనలో గణనీయ మార్పు, తదితర అంశాల్లో చక్కటి పురోగతి కన్పిస్తోంది.

# లంచాలకు లారీలోడిలి...!



కొత్తగూడెం : రూ.13.46 కోట్లు.. పేదల ఆకలి తీర్చడానికి ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే రేషన్ బియ్యంతో గతేడాది వ్యవధిలో అక్రమార్కులు చేసిన వ్యాపారం విలువ ఇది. తనిఖీల్లో దొరకని వారు.. ఆమ్యామ్యాలతో తప్పించుకునే అక్రమార్కులు తరలించే సరకును జోడిస్తే ఆ విలువ ఇంకెంత పెరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

నిత్యం సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు చేపడుతున్నా టన్నుల కొద్దీ బియ్యాన్ని అవలీలగా సరిహద్దులు దాటించేస్తున్న వైనం ఆరోపణలకు తావిస్తోంది. కొందరు అధికారులు లంచాలకు లారీలొదులుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కమీషన్ కంటే కాసులకు కక్కుర్తి పడే రేషన్ డీలర్లు, లబ్ధిదారుల నుంచి చౌకగా కొనే వ్యాపారులు, వీరిని చూసీచూడనట్లు వదిలేసే అధికారులు.. వెరసి రేషన్ బియ్యం దందా మూడు లారీలు, ఆరు మార్గాల చందంగా సాగుతోంది. జిల్లాలో కొందరు వ్యాపారులు ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ, సుజాతనగర్, కొత్తగూడెం అడ్డాగా దందా సాగిస్తున్నారు. తొలుత గ్రామాలు, వార్డుల్లో ఇళ్లకు తిరిగి లబ్ధిదారుల నుంచి కిలో రూ.6 నుంచి రూ.8 చొప్పున రేషన్ బియ్యం కొంటున్నారు. ఆయా నిల్వలను నమ్మకస్థులైన బినామీల నివాసాలు, దుకాణాల్లో దాచేస్తున్నారు. లోడు కాగానే లారీలు, వ్యాన్లలో పొరుగు రాష్ట్రాలకు పంపించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో పట్టున్న వారి హవా కొనసాగుతోంది. వీరిని కాదని ఇంకెవరైనా కొత్తగా ప్రవేశిస్తే.. వారి సరకు ఎక్కడో ఒకచోట పోలీసులకు పట్టుబడటం ఖాయం. ఈక్రమంలో కొందరు అధికారులు, సిబ్బందిని మచ్చిక చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన వారు వాహనాలు విడిపించుకునేందుకు భారీ ఎత్తున ముడుపులు చెల్లించుకోక తప్పని పరిస్థితి. సరకును బట్టి కేసుకు అదనంగా లోడుకు రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు చేతులు తడపాల్సి వస్తోందని సమాచారం. ఇటీవల ఇల్లెందు నుంచి తరలిపోతున్న రేషన్ బియ్యం లోడు కొత్తగూడెంలో చిక్కింది. వాహనం వదిలిపెట్టే ఒప్పందంలో తేడా రావడంతో అక్రమ రవాణా విషయం బయటకు పొక్కింది. బియ్యం అక్రమ రవాణాను అరికట్టే బాధ్యత రెవెన్యూతో పాటు పోలీసు శాఖపై ఉంది. పౌరసరఫరాల అధికారుల దాడుల్లో కంటే పోలీసు తనిఖీల్లోనే ఎక్కువ వాహనాలు పట్టుబడుతున్నాయి. ఆ తర్వాతే సివిల్ సప్లై విభాగానికి కేసు బదలాయిస్తున్నారు. వాహనాలను ఠాణాలకు తరలించకుండా ఉండేందుకు, తక్కువ సరకు చూపే క్రమంలో రూ.లక్షల్లో వసూళ్ల దందా జరుగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ బృందాల నిఘా - ఎస్పీ, వినీత్

రేషన్ బియ్యం రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు టాస్క్‌ఫోర్సు బృందాలు ఏర్పాటు చేశాం. రెవెన్యూ అధికారుల సమన్వయంతో ఇవి పనిచేస్తున్నాయి. బియ్యం సేకరణపై ప్రత్యేక నిఘా ఉంది. అక్రమార్కులకు కొమ్ముకాసే అధికారులుంటే ఫిర్యాదు చేయాలి. పట్టుబడ్డ వాహనాల విడుదల, అక్రమ రవాణా కట్టడిలో పారదర్శకంగా వ్యవహరిస్తాం.

# స్థలదాతల స్ఫూర్తి

ఖమ్మం : తాము వితరణ చేసే స్థలం పది మందికి ఉపయోగ పడాలన్నదే వారి ఆలోచన.. రూ.లక్షల విలువ చేసే భూమిని సైతం ఆరోగ్య ఉపకేంద్రాలు, రైతు వేదికలు, ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాలకు దానం చేస్తూ పలువురు ఆదర్శంగా నిలుస్తున్నారు. గతంలోని భూదానాలను స్ఫూర్తిగా తీసుకొని తమ పట్టా భూములను సైతం గ్రామ పంచాయతీలకు రిజిస్టర్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, అధికారులు అడిగిందే తడవుగా ఉభయ జిల్లాల్లో ఇటీవల కాలంలో కొందరు తమకున్న దాంట్లో కొంత భూమిని దానం చేస్తున్నారు.

కొదుమూరులో ఆరోగ్య ఉపకేంద్రం

చింతకాని మండలం కొదుమూరుకు ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రం మంజూరు చేసింది. కేంద్రం నిర్మాణానికి రూ.30 లక్షల విలువైన మూడు కుంటల స్థలాన్ని స్థానికుడు యలనాటి ప్రసాదరావు ఇటీవల వితరణగా అందజేశారు. ఖమ్మం ప్రధాన రహదారి పక్కనే ఉన్న 3 కుంటల విలువైన స్థలాన్ని ఆరోగ్య ఉపకేంద్రానికి ఈ నెల 10న రిజిస్ట్రేషన్ చేయించారు. ప్రసాదరావు తండ్రి కోటయ్య గ్రామంలో ఉన్నత పాఠశాల నిర్మాణానికి గతంలో రెండెకరాల స్థలాన్ని, వైకుంఠధామంకు వెళ్లేందుకు రహదారి కోసం ఆయన కుటుంబీకులు ఇటీవల మూడు కుంటల స్థలాన్ని వితరణగా ఇచ్చారు. పాతర్లపాడులో పీహెచ్‌సీ భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన కేశరాజు వెంకట శ్యామ్‌సుందర్‌రావు కుటుంబీకులు రూ. 12లక్షల విలువైన నాలుగు కుంటల



స్థలాన్ని ఈ నెల 14న వితరణగా అందజేశారు.

ఇరవెండికి సహకార సంఘ గోదాము

భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాము నిర్మాణానికి తాళ్లూరి పంచాక్షరయ్య ఛారిటబుల్ ట్రస్ట్ సుమారు రూ.70 లక్షల విలువైన ఎకరం స్థలాన్ని దానం చేసింది. ప్రస్తుతం గోదాము ప్రారంభానికి సిద్ధమవుతోంది. దీంతో రైతులు తాము పండించిన పంటలను ఈ గోదాములో నిల్వ చేసుకొనే సౌలభ్యం కలుగనుంది.

కోయగూడెంలో వైకుంఠధామం

భద్రాద్రి జిల్లా సుజాతనగర్ మండలం కోయగూడెంలో పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం ఏర్పాటుకు గ్రామ వాసి కంగాల అరుణ్‌కుమార్ రూ.12 లక్షల విలువైన 12 కుంటల భూమిని వితరణగా అందజేశారు. ఇదే మండలం కోమటపల్లిలో రైతు భూక్యా శోభన్ రూ.15లక్షల విలువైన 1.10 ఎకరాల భూమిని గ్రామ పంచాయతీకి వితరణగా అందజేశారు. మా గ్రామంలో ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో పలువురం కలిసి రూ.20 లక్షలతో ఎకరం స్థలం కొనుగోలు చేశాం. ఆ స్థలంలో పూర్తయిన భవనాన్ని ఇటీవల ప్రారంభించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి ఆర్థిక సాయం చేయటం సంతోషంగా ఉంది. నల్లమోతు శేషయ్య, పాతర్లపాడు

# ఖమ్మంలో భళా... మిగతాచోట్ల డీలా....



ఖమ్మం : వినియోగదారులకు ఒకేచోట అన్నిరకాల నిత్యవసరాలు లభించడంతోపాటు రైతులు, వ్యాపారులు సులభంగా విక్రయాలు సాగించేలా పట్టణాలు, నగరాల్లో ప్రతి 2 లక్షల మంది జనాభాకు ఒక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ చొప్పున నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో సమీకృత మార్కెట్ నిర్మాణానికి రూ.4.50 కోట్లు కేటాయించినా ఆచరణలో బల్దియాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఏడాది క్రితం చేపట్టిన సమీకృత మార్కెట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఖమ్మం నగరంలో రెండు మార్కెట్లు ప్రజలకు అందుబాటులోకి రాగా.. మిగిలిన పట్టణాల్లో అతీగతీ లేకుండా పోయింది.

జనాభా అవసరాలకు తగ్గట్టు.. పెరిగిన జనాభా అవసరాలకు ప్రస్తుత రైతుబజార్లు సరిపడకపోవటం, నిత్యావసరాలు విక్రయించేందుకు అనువైన సౌకర్యాలు లేకపోవడం, నేలపై కూరగాయలు అమ్మటం ద్వారా ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి పూనుకుంది. ఖమ్మం నగరంలో రెండు, వైరా, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు పురపాలికల్లో ఒక్కో మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభించింది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ.. ఉభయ జిల్లాల్లో తొమ్మిది సమీకృత మార్కెట్ల నిర్మాణాలు చేపట్టినా ఖమ్మంలో మాత్రమే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మధిరలో మార్కెట్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. రంగులు, టైల్స్ వేసే పనులు మిగిలాయి. మిగతా చోట్ల అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నిర్మాణాలు నత్తనడక సాగుతున్నాయి. వైరాలో ఏడాదిన్నర క్రితమే పనులు మొదలుపెట్టినా ఇప్పటికీ కొలిక్కిరాలేదు. సుమారు 100 గదులు నిర్మించాల్సి ఉన్నా అతీగతి లేదు. సత్తుపల్లి పురపాలక కార్యాలయం సమీపంలో మార్కెట్ పనులు ఏడాదిగా ముందుకు సాగడం లేదు. ఇటీవల క్షేత్రస్థాయిలో కలెక్టర్ వీపీ గౌతమ్ పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగూడెం రైతుబజార్ సమీపంలో నిర్మాణం ఆరు నెలల క్రితమే మొదలైనా ఇప్పటికీ పిల్లర్ల దశలోనే ఉంది. మణుగూరు, పాల్వంచలోనూ ఇదే పరిస్థితి. ఇల్లెందులోని జేకే కాలనీలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి స్థలం సేకరించి టెండరు ప్రక్రియను పూర్తిచేసినా పనులు ప్రారంభం కాలేదు.

శాసనసభలో ప్రస్తావన..

ఖమ్మం నూతన బస్టాండ్ సమీపంలో సమీకృత మార్కెట్ నిత్యం వినియోగదారులు, వ్యాపారులతో కళకళలాడుతోంది. వీడీవోస్ కాలనీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన మార్కెట్ నగరవాసుల్ని ఆకట్టుకుంటోంది. దీన్ని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ త్వరలో ప్రారంభించనున్నారు. ఇటీవల శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ మార్కెట్ గురించి ప్రస్తావించారు. అద్భుతంగా నిర్మించారంటూ మంత్రి పువ్వాడ అజయ్‌ను అభినందించారు.

# దళితబంధు పర్యవేక్షణకు ప్రత్యేక యాప్

ఖమ్మం : దళితుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధులో నిర్వహణను మెరుగుపర్చే కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక యాప్‌ను ఇటీవల రూపొందించారు. 'మొబైల్ మానిటరింగ్ యాప్' ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి యూనిట్‌ను నిత్యం పర్యవేక్షించనున్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో చింతకాని సహా నాలుగు మండలాలు ఎంపికైన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు మంజూరైన యూనిట్ల వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. లబ్ధిదారుల వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయనున్నారు.

ప్రతి యూనిట్‌ను నమోదు చేయాల్సిందే..

దళితబంధు పథకంలో భాగంగా చింతకాని మండల వ్యాప్తంగా ఇప్పటికే 3,462 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో అధికంగా డెయిరీ యూనిట్లు, జేసీబీలు, గూడ్స్ కారియర్స్, ట్రాక్టర్లు, కార్లు, హార్వెస్టర్లు ఉన్నాయి. ప్రతి యూనిట్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శి,



ఎంపీడీవో, గ్రామ ప్రత్యేక అధికారితో పాటు జిల్లా అధికారులు ఎక్కడ యూనిట్ ఉంటే అక్కడకు వెళ్లి తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఆ యూనిట్ పూర్తి వివరాలు లబ్ధిదారుడి గుర్తింపు సంఖ్య ఆధారంగా యాప్‌లో నమోదు చేస్తారు. యూనిట్ వేరే ప్రాంతంలో ఉన్నా అధికారులు అక్కడకు వెళ్లి లేదా ఆ యూనిట్‌ను తెప్పించుకొని తనిఖీ చేయాల్సి ఉంది. యూనిట్‌ను యాప్‌లో అక్షాంశ, రేఖాంశాలతో సహా నమోదు చేస్తారు. తద్వారా యూనిట్ ఉన్న ప్రదేశాన్ని సైతం గుర్తిస్తారు. యూనిట్ నిర్వహణ వల్ల లబ్ధిదారులు పొందిన ఆర్థిక లాభాలు, ప్రస్తుతం దాని యాజమాన్య పత్రాలు వంటి వివరాలు కూడా నమోదు చేయాలి. ఈ ప్రక్రియ ద్వారా యూనిట్ నిర్వహణలో లోపాలను ఎప్పటికప్పుడు సరిదిద్దవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎక్కడున్నాయో పరిశీలిస్తాం: విజం అప్పారావు, జడ్పీ సీఈవోయాప్ ద్వారా ఆయా యూనిట్లను నిత్యం ట్రాకింగ్ ద్వారా ఎక్కడ ఉన్నాయో పరిశీలిస్తాం. పంచాయతీ కార్యదర్శి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సైతం యూనిట్లను పర్యవేక్షించే సౌలభ్యం ఉంది. యూనిట్ల నమోదు వల్ల యాజమాన్య బదలాయింపులకు అడ్డుకట్ట పడుతుంది. నిర్వహణలో లబ్ధిదారులకు ఏదైనా ఇబ్బంది కలిగినా నిరంతర పర్యవేక్షణతో తక్షణమే సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది.

# విద్యార్థుల ఫీజులు స్వాహా

ఖమ్మం : ఖమ్మంలోని 'డైట్' కళాశాలలో విద్యార్థుల ఫీజులను స్వాహా చేసిన ఘటన వెలుగుచూసింది. కళాశాలలో పనిచేసే ఓ ఉద్యోగి ఈ రుసుములను కాజేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతుంటారు. 2016-17 విద్యాసంవత్సరంలో 96 మంది విద్యార్థులు ఈ కళాశాలలో చేరారు. ఒక్కో విద్యార్థి రూ.2,255 చొప్పున మొత్తం రూ.2.16లక్షల ప్రవేశ రుసుము చెల్లించారు. ఒకరిద్దరివి తప్ప మిగతా వారి ఫీజులు కళాశాల బ్యాంకు ఖాతాలో జమకాలేదు.

చర్యలకు రంగం సిద్ధం..

ఇక్కడ ఫీజుల స్వాహా విషయంపై గత డిసెంబరులో కళాశాల అధికారులు డీఈఓకు లేఖ రాశారు. ఈనెల 8న సదరు ఉద్యోగికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రుసుములు స్వాహా చేసిన తేదీ నుంచి ఆర్‌బీఐ వడ్డీ రేటు 6.75శాతంతో పాటు అదనపు వడ్డీ 2శాతం కలిపి ఐదు రోజుల్లో చెల్లించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

తనిఖీతో వెలుగులోకి...

గతేడాది ఆగస్టు 30న ఆడిట్ అధికారులు కళాశాలలో సుమారు




రూ.2.10లక్షల స్వాహా గురించి నివేదిక ఇచ్చారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ ఆరా తీయగా.. కళాశాలలో పనిచేసే ఓ ఉద్యోగికి తాము రుసుము చెల్లించినా రసీదు ఇవ్వలేదని విద్యార్థులు బదులిచ్చారు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన రుసుములను త్వరలోనే తిరిగి చెల్లిస్తానని ప్రిన్సిపల్‌కు రాతపూర్వకంగా సదరు ఉద్యోగి సమాధానమిచ్చారు. ఉద్యోగిపై అభియోగాలు నమోదు సోమశేఖరశర్మ, డీఈఓ, ఖమ్మంవిద్యార్థుల ఫీజులను పక్కదారి పట్టించిన ఉద్యోగిపై అభియోగాలు నమోదు చేశాం. అతడిపై చర్యలు తీసుకోవాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్‌ను కోరాం. స్వాహా చేసిన డబ్బును రికవరీ చేయాలని ఆదేశించాం.

# అధిక ధరలకు యూరియా విక్రయాలు

దంతాలపల్లి : రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు.. దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. యాసంగి పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దంతాలపల్లి మండలంలోని 17 గ్రామాలతో పాటు శివారు తండాల్లో యాసంగి సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. వరి పొలాల్లో కలుపు పనులు పూర్తవడం, మిర్చి, మొక్కజొన్న, వేరుశనగ పంటలకు ఎరువులు వేసే సమయం కావడంతో రైతులు యూరియా కోసం మందుల దుకాణాల బాట పడుతున్నారు. దంతాలపల్లిలోని ఎరువుల దుకాణాల్లో సరిపడ యూరియా లేదని దుకాణదారులు చెబుతుండటంతో అన్నదాతలు ఆందోళను గురవుతున్నారు. ఒక్కసారిగా యూరియా కొరత నెలకొంది. కొన్ని దుకాణాల్లో యూరియా ఉన్నప్పటికీ అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. బస్తాకు రూ.266.50కు విక్రయించాల్సి ఉండగా హమాలీకి రూ.6 చొప్పున రూ.272 చొప్పున విక్రయిస్తున్నారు. కొందరు దుకాణాదారులు రూ.300 దాకా విక్రయిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూరియా



విక్రయాలు జరపాల్సి ఉన్నా దుకాణాదారులు అవేమీ పట్టించుకోకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. మరికొందరు ఇతర రకాల పురుగుల మందులు తీసుకుంటేనే యూరియా ఇస్తామంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రెండు ఆగ్రోస్ కేంద్రాలకు యూరియా రాగా రైతులు బస్తాల కోసం ఎగబడ్డారు. యూరియా దొరకని రైతులు చేసేది లేక ఇంటిబాట పట్టారు. అధికారులు స్పందించి మండలానికి సరిపడ కేటాయించాలని, ఎమ్మార్పీ ధరకే యూరియా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ఏడీఏ శోభన్‌బాబు వద్ద ప్రస్తావించగా యూరియా కొరత లేకుండా చూస్తామన్నారు. సరిపడ యూరియా దిగుమతి నిమిత్తం ఇండెంట్ పెడుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీ ధరలకు మించి దుకాణాదారులు రైతుల నుంచి అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు.




# ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సోనియా లేఖ

దిల్లీ: ఎలాంటి ఎజెండాను ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడంపై ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ విషయమై తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల ఎజెండా ఏంటో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే.. ఈ ఎజెండాలో 9 అంశాలను చేర్చాలని ఆమె లేఖలో పేర్కొన్నారు. "ఇతర రాజకీయ పార్టీలను సంప్రదించకుండానే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల తేదీలను ప్రకటించారు. ఈ సమావేశాల ఎజెండా ఏంటో మాకెవరికీ కనీస అవగాహన లేదు. మొత్తం ఐదు రోజుల పాటూ ప్రభుత్వ ఎజెండాకే కేటాయించినట్లు మాకు తెలిసింది. అయితే వచ్చే సమావేశాల్లో కొన్ని అంశాలను చర్చకు తీసుకురావాలని మేం కోరుతున్నాం" అని సోనియా గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. అదానీ అక్రమాలు, మణిపూర్ అల్లర్లు, రైతు సమస్యలు, కనీస మద్దతు ధర విషయంలో ఇచ్చిన హామీ, కులాల వారీగా జనగణన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య రోజురోజుకీ దిగజారుతున్న సంబంధాలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను ఆదుకోవడం, హరియాణా సహా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో చెలరేగుతున్న మత ఘర్షణలు, సరిహద్దుల్లో కొనసాగుతున్న చైనా ఆక్రమణలపై చర్చ చేపట్టాలని ప్రధాని మోదీని కోరారు. ఇదిలా ఉండగా.. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఇండియా కూటమిలోని పలు భాగస్వామ్య పక్షాల నేతలు మంగళవారం భేటీ అయిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ, సీపీఎం, సీపీఐ, ఆప్, టీఎంసీ, ఆర్జేడీ, ఎస్పీ, జేఎంఎం తదితర పార్టీల నేతలు పాల్గొన్నారు. 'మోదీ చాలీసా కోసం మేము పార్లమెంటుకు వెళ్లం. సమావేశాల్లో ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని భేటీ అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ తెలిపారు. సెప్టెంబరు 18 నుంచి 22 వరకు ఐదు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ ప్రత్యేకం వెనుక ఆంతర్యం ఏంటనేదానిపై ఎలాంటి స్పష్టత లేదు. అయితే, జమిలి ఎన్నికల కోసం బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు, ఓబీసీ వర్గీకరణ వంటి అంశాలపై చర్చించడానికే ఈ సమావేశాలను ఏర్పాటు చేసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# ఏపీలో పెన్షన్ దారులకు మరో గుడ్ న్యూస్-ఈ నెలలోనే అలా..!

ఏపీలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా సామాజిక పెన్షన్లు అందుకుంటున్న వారికి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటివరకూ పెన్షన్ రాలేదని బాధపడుతున్న వారికి శుభవార్త అందించింది. పెన్షన్లకు అర్హత ఉండీ ఇప్పటివరకూ అందుకోని వారికి జగనన్న సురక్ష పథకం ద్వారా గుర్తించిన ప్రభుత్వం వారిని కూడా లబ్దిదారుల జాబితాలో చేరుస్తోంది. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం వీరికి పెన్షన్లు పంపిణీ చేయబోతోంది. దీంతో ఈసారి పెన్షన్ల చెల్లింపు తేదీని పొడిగించింది. ఏపీలో వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రభుత్వం పెన్షన్ల పంపిణీని ప్రతీ నెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీ లోపు పూర్తి చేస్తోంది. వాలంటీర్లు స్వయంగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారు. అయితే ఈసారి మాత్రం కొత్త లబ్దిదారుల చేరిక, వారి పేర్లతో జాబితాల్ని అప్ డేట్ చేయడం వంటి కారణాలతో పెన్షన్ల చెల్లింపు తేదీని తొలుత ఈనెల 7వ తేదీకి పొడిగించింది. అయితే తాజాగా దీన్ని ఈనెల 10వరకూ పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 10వ తేదీ లోపు అందరికీ పెన్షన్లు అందబోతున్నాయి. %ఝుఅశ్రీవతీ%: జైలర్ సినిమా నిర్మాత గొప్ప మనస్సు.. పేద పిల్లల గుండె ఆపరేషన్లకు రూ.కోటి సాయం.. వైసీపీ సర్కార్ గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది జూన్ వరకూ పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తుల్ని పరిశీలించి వాటిని రెగ్యులర్ గా పెన్షన్లు ఇచ్చే జాబితాలో చేర్చే ప్రక్రియ చేపట్టింది. అయితే ఈ అదనంగా చేరిన వారికి సైతం పెన్షన్ల చెల్లింపు కోసం నిధులు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది.



ఈ ప్రక్రియలో కాస్త ఆలస్యం చోటు చేసుకుంటోంది. దీంతో ప్రభుత్వం ఈ నెల 10వ తేదీ వరకూ పెన్షన్లు చెల్లించేందుకు సెర్ప్ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో వారు క్షేత్రస్థాయికి ఈ ఆదేశాలు పంపుతున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద ప్రస్తుతం లబ్దిదారులకు నెలకు రూ.2750 చొప్పున పెన్షన్ చెల్లిస్తున్నారు. ఈ మొత్తం వచ్చే ఏడాది కల్లా 3 వేలకు చేరాల్సి ఉంది.

ఈ నేపథ్యంలో అర్హత ఉండి పెన్షన్ అందని లక్షకు పైగా లబ్దిదారుల్ని తాజాగా ఈ పథకంలో చేర్చారు. వీరికి కూడా కలిపి ప్రతీ నెలా పెన్షన్ చెల్లించబోతున్నారు. ఈ ప్రక్రియలో జరుగుతున్న ఆలస్యం కారణంగా కేవలం సెప్టెంబర్ నెల వరకే 10వ తేదీ వరకూ పెన్షన్ల చెల్లింపు తేదీని పొడిగించినట్లు తెలుస్తోంది. వచ్చే నెల నుంచి తిరిగి 5వ తేదీ వరకూ పెన్షన్లు చెల్లిస్తారు.

# సీఎం జగన్‌పై విరుచుకుపడ్డ చంద్రబాబు




అనంతపురం: ప్రజాసమస్యలపై మాట్లాడితే రౌడీలతో దాడులు చేస్తున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పల్లె ప్రగతి కోసం ప్రజావేదికలో టీడీపీ అధినేత మాట్లాడుతూ.. మాజీ మంత్రి వివేకానందరెడ్డిని హత్య చేసి మరుసటి రోజు నారాసుర రక్త చరిత్ర అని రాస్తారన్నారు. అనేక రకాలుగా అపవాదులు వేశారని... రివర్స్‌లో కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అంగళ్లలో తన మీద హత్యాప్రయత్నం చేసి పైగా తన మీదే 307 కేసు పెట్టారన్నారు. తాను చెబితేనే దాడులు చేసినట్లు ఒత్తడి చేస్తూ స్టేట్‌మెంట్ రాయిస్తున్నారన్నారు. యువగళంకు వచ్చి దాడులు చేసి వాళ్లపైనే కేసులు పెడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి కరుడుగట్టిన సైకో అని... సైకో నుంచి ఈ రాష్ట్రాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. రివర్స్ టెండరింగ్ పెట్టి రివర్స్ పాలనకు తెరతీశారని విరుచుకుపడ్డారు. బటన్ నొక్కడం ఒక్కటే తెలుసని ... ఇచ్చిన డబ్బులకంటే పేపర్ ప్రకటనలకు ఎక్కువ ఇచ్చారన్నారు. తాను ష్యూరిటీ ఇస్తున్నా పేదలను ధనవంతులుగా మారుస్తానని తెలిపారు. తమ పైన కేసులు పెట్టి లండన్‌లో ఏం ట్రీట్మెంట్ తీసుకుంటున్నారో.. ఏం చేస్తున్నారో అంటూ చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు.

# వైసీపీ వాళ్లే పై కేసులు ... అరెస్టులు ఉండవ్

విజయవాడ : వైసీపీ నాయకుల అరాచకాలు శృతి మించుతున్నాయని టీడీపీ నేత కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. యువగళం పాదయాత్రకు ఆటంకం కలిగించేలా రెచ్చగొట్టారన్నారు. కర్రలు, రాళ్లు, సీసాలతో దాడులకు తెగ బడ్డారన్నారు.

యువగళం వలంటీర్లు వారిని అడ్డుకున్నారని.. లేకుంటే మా వాళ్ల ప్రాణాలు పోయేవని కొల్లు రవీంద్ర తెలిపారు. గన్నవరంలో కూడా ఇదే విధంగా దాడి చేశారన్నారు. దాడులు చేసిన వైసీపీ వాళ్లను పోలీసులు వదిలేశారన్నారు. అర్ధరాత్రి యువగళం వలంటీర్లను అరెస్టు చేయడం దుర్మార్గం కాదా? అని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. వాళ్లను స్టేషన్‌లో ఉంచకుండా ప్రైవేటు గోడౌన్ లో ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ వాళ్ల పై కేసులు ... అరెస్టులు ఉండవన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఉందా? అని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు.



డీజీపీ, జిల్లా ఎస్పీలు వాళ్ల ఆగడాలను అరి కట్టలేక పోతున్నారన్నారు. కొంతమంది పోలీసు అధికారులు పాలకుల చెప్పు చేతల్లో పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలు, వైసీపీ రౌడీయిజాన్ని ప్రజల్లోకి తీసుకెళతామని కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# టీటీడీ ట్రస్ట్ బోర్డు మెంబర్ల ఎన్నికపై హైకోర్టులో విచారణ

అమరావతి: నేర చరిత్ర ఉన్న వ్యక్తులను తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్లుగా ఎన్నిక చేయటంపై హైకోర్టులో విచారణ జరిగింది. ఎండోమెంట్ చట్టాలను వ్యతిరేకంగా నేరచరిత్ర ఉన్న వ్యక్తులు శరత్ చంద్రారెడ్డి, డాక్టర్ కేతన్, సామినేని ఉదయభాను నియామకం చెల్లదంటూ విజయవాడకు చెందిన మాజీ రైల్వే ఉద్యోగి చింతా వెంకటేశ్వర్లు హైకోర్టులోప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నిందితుడిగా ఉన్న శరత్ చంద్రారెడ్డి, ఎమ్మెల్యే ఉదయభాను, డాక్టర్ కేతన్‌పై తీవ్రమైన నేరారూపణలు ఉన్నాయని తెలిపారు. పరమ పవిత్ర తిరుపతి దేవస్థానంలో ఇలాంటి నేరచరిత్ర ఉన్నవారు ఉండటం భక్తుల మనోభావాలకు తీవ్ర విఘాతం కలిగించే విధంగా ఉన్నాయంటూ పిటిషనర్ పేర్కొన్నారు. తాత్కాలిక బెయిల్‌పై కొనసాగుతున్న నిందితుడిని తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ ప్రయోజనాలతో ఎన్నిక చేయటం చట్ట విరుద్ధమని పిటిషన్లో తెలిపారు. ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని జస్టిస్ ఆకుల శేష సాయి జస్టిస్ రఘునందన్ రావు ధర్మాసనం ఈరోజు (బుధవారం) విచారించింది. పిటిషనర్ తరుపున ప్రముఖ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. ప్రతివాదులుగా ఉన్న దేవదయ శాఖ కమిషనర్, తిరుపతి తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను ధర్మాసనం వివరణ కోరింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను హైకోర్టు వచ్చే బుధవారానికి (సెప్టెంబర్ 13) వాయిదా వేసింది.




భీమవరం: కొంతమంది పోలీసుల తీరుతో ఆ వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. 'యువగళం' పాదయాత్రలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు వెళ్లారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం పరిధిలోని బేతపూడిలోని క్యాంప్‌సైట్‌కు వెళ్లిన పోలీసులతో లోకేశ్ మాట్లాడారు. వైకాపా శ్రేణులే కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాయని లోకేశ్ ఆరోపించారు. తమను కించపరిచేలా ఫ్లెక్సీలు పెడుతున్నప్పుడు వాటిని ఎలా అనుమతించారని పోలీసులను ఆయన ప్రశ్నించారు. తాడేరు వద్ద వైకాపా శ్రేణులే తమపై రాళ్ల దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. 'యువగళం' వాలంటీర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదయాత్రలో శాంతిభద్రతలకు తానెక్కడా విఘాతం కలిగించలేదని చెప్పారు. యువగళం పాదయాత్ర యువత గళం ప్రభుత్వానికి వినిపించేందుకే తప్ప.. గొడవలు సృష్టించేందుకు కాదన్నారు. తన పాదయాత్ర సజావుగా సాగేందుకు సహకరించాలని పోలీసులను ఆయన కోరారు.

**ఆ ఫ్లెక్సీలను ఎలా అనుమతించారు?** "ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణాతో పాటు పల్నాడు జిల్లాల్లో పర్యటించాను. ఎక్కడా జరగని గొడవలు భీమవరంలోనే జరుగుతున్నాయి.

రెచ్చగొట్టేలా నేను ఏం వ్యాఖ్యలు చేశానో చెప్పాలి. ఏ పదాలు కించపరిచేలా ఉన్నాయో జగన్‌ను చెప్పమనండి. ఆయనకు రూ.లక్షకోట్ల ఆస్తి ఉంది. రూ.12కోట్లు ఖర్చు చేసి ప్రత్యేక విమానంలో లండన్ వెళ్లారు. ఇవే విషయాలు మేం చెప్తే తప్పేంటి? కడప ఎంపీని ఏ9గా సీబీఐ ఛార్జ్ షీట్‌లో పేర్కొంది. అదే ప్రజలకు చెబుతున్నాం. వైకాపా వాళ్లు గడప గడపకు కార్యక్రమం చేస్తున్నారు. వాళ్ల ఒక్క ఫ్లెక్సీ జోలికి కూడా మేం వెళ్లడం లేదు. మమ్మల్ని కించపరిచేలా ఫ్లెక్సీలు పెట్టినపుడు ఎలా అనుమతించారు?

**మిథున్‌రెడ్డిని ఇక్కడికి రాకుండా ఆపండి :** భీమవరం పట్టణంలోనూ వైకాపా ఫ్లెక్సీలు, జెండాలు ఉన్నాయి. వాటిని మేమేం చేయలేదు. అయినా రాళ్ల దాడి చేశారు. దాడికి యత్నిస్తున్నారని సెప్టెంబర్ 4నే పోలీసులకు చెప్పాం. మీరు చర్యలు తీసుకోలేదు. శాంతియుతంగా పాదయాత్ర కొనసాగిస్తున్నా నినాదాలు చేస్తూ కర్రలు, రాళ్లతో దాడి చేశారు. వైకాపా వాళ్లకి పోలీసులే భద్రత కల్పిస్తున్నారు.

మేం శాంతిభద్రతలకు విఘాతం కలిగించం.. మా జోలికి వస్తే ఆత్మరక్షణ చేసుకునే హక్కు మాత్రం మాకు ఉంటుంది. వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డిని ఇక్కడికి రాకుండా ఆపండి. శాంతియుతంగా ఉన్న గోదావరి జిల్లాల్లో గొడవలు సృష్టిస్తున్నారు.

**చట్టం ఏ ఒక్కరికీ చుట్టంలా మార్చొద్దు..** పవన్‌కల్యాణ్ వారాహియాత్ర సమయంలో ఇక్కడే వైకాపా కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎందుకు పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు? దీనిపై పోలీసులు ఆలోచన చేయాలి. మా వాలంటీర్లను అదుపులోకి తీసుకుని వైకాపా నేతల ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. చట్టాలు ఇరువైపులా సమానంగా అమలు చేయండి. చట్టం ఏ ఒక్కరికీ చుట్టంలా మార్చొద్దు.. ఇది రాష్ట్రానికి మంచిది కాదు. జగన్ పాదయాత్రలో ఇలాంటి ఘటన ఒక్కటి కూడా జరగలేదు. వైకాపా కార్యకర్తలను ఎందుకు పంపించారని ఎమ్మెల్యేకు నోటీసులు పంపారా?" అని లోకేశ్ ప్రశ్నించారు.




# పోలీసుల అదుపులో 50 మంది వాలంటీర్లు!

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం బేతపూడి వద్ద తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం' పాదయాత్ర క్యాంప్ సైట్‌పై పోలీసులు అర్ధరాత్రి దాడి చేశారు. 3 వాహనాల్లో వచ్చిన పోలీసులు.. యువగళం వాలంటీర్లు, కిచెన్ సిబ్బంది సహా సుమారు 50 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు తమపై విచక్షణారహితంగా దాడి చేశారని వాలంటీర్లు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాత్రి వైకాపా నేతలు, కార్యకర్తలు పక్కాగా కాపుకాచి లోకేశ్ పాదయాత్రపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పలువురు తెదేపా నేతలు, కార్యకర్తలతో పాటు పోలీసులలకు గాయాలయ్యాయి.

ఈ ఘటన నేపథ్యంలోనే యువగళం వాలంటీర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని రాత్రి నుంచి పోలీసులు వివిధ ప్రాంతాల్లో తిప్పుతున్నారు. భీమవరం, నర్సాపురం, వీరవాసరం కాళ్ల పోలీస్‌స్టేషన్లు తిప్పారు. ప్రస్తుతం వారిని సిసిలిలోని రాజ్యలక్ష్మి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ఫ్యాక్టరీలో ఉంచారు. అదుపులోకి తీసుకున్న వాలంటీర్లపై సెక్షన్ 307 కింద హత్యాయత్నం కేసు నమోదు చేసేందుకు పోలీసులు యత్నిస్తున్నారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు. యువగళం పాదయాత్రకి అనుమతి ఇచ్చి అదే రూట్‌లో వైకాపా కార్యకర్తలు కవ్వింపు చర్యలు.. రాళ్ల దాడి చేస్తే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




వాషింగ్టన్: భారత్‌లో చంద్రయాన్-3 ప్రయోగానికి సంబంధించి ఇస్రో ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ ఇస్తూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతూనే ఉంది. అయితే తాజాగా అమెరికాకు చెందిన నేషనల్ ఏరోనాటిక్స్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్(నాసా) చంద్రయాన్-3 ల్యాండర్ చిత్రాన్ని ఎక్స్(ట్విటర్)లో పంచుకుంది. తన ఉపగ్రహం ఈ ఫొటోను తీసినట్లు తెలిపింది. 'జాబిల్లి ఉపరితలంపై ఉన్న చంద్రయాన్-3 ల్యాండర్‌ను నాసాకు చెందిన ఎల్ఆర్ఓ(లునార్ రికానజెన్స్ ఆర్బిటర్) స్పేస్‌క్రాఫ్ట్ ఫొటో తీసింది. ఆగస్టు 23న ఈ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సుమారు 600 కి.మీ దూరంలో దిగింది' అని నాసా వెల్లడించింది. ల్యాండర్ దిగిన నాలుగురోజుల తర్వాత ఆగస్టు 27న ఎల్ఆర్ఓ ఈ చిత్రాన్ని తీసింది. జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ దిగుతున్నప్పుడు కలిగిన రాపిడి వల్ల ఒక తెల్లని వలయం ఏర్పడిందని ఈ చిత్రాలను బట్టి తెలుస్తోంది.

**ఆదిత్య-ఎల్1 కక్ష్య మరింత పెంపు :** చంద్రుడి ఉపరితలం 3డీ అనాగ్లిఫ్ చిత్రాన్ని నిన్న ఇస్రో విడుదల చేసింది. అందులో విక్రమ్ ల్యాండర్ ఉన్న ప్రాంతంలో చంద్రుడి ఉపరితలం ఎలా ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజ్ఞాన్ రోవర్‌కు అమర్చిన నేవిగేషన్ కెమెరాలతో తీసిన చిత్రాలను ప్రత్యేక పద్ధతిలో క్రోడీకరించి ఈ చిత్రాన్ని రూపొందించినట్లు ఇస్రో ఎక్స్ (ట్విటర్) వేదికగా విడుదల చేసింది. స్టీరియో లేదా మల్టీ వ్యూ ఇమేజ్‌లను ఒకచోట చేర్చి అవి మూడు కోణాల్లో కనిపించేలా చేయడమే అనాగ్లిఫ్. ప్రస్తుతం నిద్రాణంలో ఉన్న ల్యాండర్, రోవర్ సెప్టెంబర్ 22న తిరిగి మేల్కొనే అవకాశం ఉందని ఇస్రో భావిస్తోంది. ఊహించినట్లు అవి పని చేస్తే.. ఇంకొన్నాళ్లపాటు పరిశోధనలు సాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొంది.

# మంత్రి సురేష్ వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

ప్రకాశం: మంత్రి ఆదిమూపు సురేష్ వ్యాఖ్యలపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న (మంగళవారం) గురుపూజోత్సవం సభలో టీచర్స్‌ను అగౌరవ పరుస్తూ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బైజూస్‌తో టెక్నాలజీ అంతా ట్యాబ్‌ల్లో వచ్చిందని.. గురువులు బదులు ఇప్పుడు గూగుల్ వచ్చిందని అన్నారు. గురువులకి తెలియనివి కూడా గూగుల్‌లో కొడితే తెలిసిపోతుందన్నారు. గూగుల్ వచ్చిన తరువాత గురువులు అవసరం లేదంటూ మంత్రి సురేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గురువులు కన్నా గూగుల్ మిన్న అంటూ మంత్రి ఆదిమూలపు సురేష్ వ్యాఖ్యలు అసంబద్ధం, అర్ధ రహితమన్నారు. గురువులకు సన్మానం చేసారో లేదా అవమానం చేశారో మంత్రి తెలుసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి గురుపూజోత్సవం రోజే, గురువుల సన్మాన సభలో



ఉపాధ్యాయులను అవమానించడం తగదన్నారు. ఉపాధ్యాయునికి ఏది ప్రత్యామ్నాయం కాదన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా గూగుల్ చదువులు లేవని తెలిపారు. గురువు లే చదువులు చెప్తున్నారని మన్నం శ్రీనివాస్ వెల్లడించారు.

# ఎరుపు మిర్చిలా మీనాక్షి మిరుమిట్లు!

'మీనాక్షి మీనాక్షి...మిరమిర మిర్చి మీనాక్షి.. ఏదేదో అవుతోందే మనసా నిను చూసి..యాక్షన్ లోకి దూకానే గీతల్ని చెరిపేసి' అంటూ సాగే పాట పాడుకోవాల్సిందే ఈ మిరుమిట్లు గొలిపే మీనాక్షిని చూసి. అమ్మడు ఎరుపు వర్ణంలో ధగ ధగలాడిపోతుంది. ఓవైపు క్లీవేజ్ అందాలు..మరోవైపు పెదాలపై అందమైన చిరు నవ్వు..చారడేసి కళ్లు...బంతిపువ్వుల్లాంటి చెవులు... మొత్తంగా చంద్రబింబం లాంటి ఆ అందాన్ని చూస్తే మతిపోవాల్సిందే. అమ్మడు కాస్త బొద్దుగానూ మారింది. ఆ బొద్దుతనం మరింత బ్యూటీని ఎలివేట్ చేస్తుంది. అమ్మడి ఖాతా తారులకు పర్ఫెక్ట్ పిక్ ఇది. ఈ స్నాప్ చూసిన తర్వాత ఎవరైనా!



మీనాక్షి అందానికి లాక్ అవ్వాల్సిందే. అల్ట్రామోడ్రన్ గాళ్ల్ గా అమ్మడు చాలా సార్లు ఇలాంటి ఫోటోలు పోస్ట్ చేసింది. కానీ ఎరుపు వర్ణం మీనాక్షిని మరింత సౌందర్యవంతంగా తీర్చిదిద్దింది. ప్రస్తుతం ఈ ఫోటో ఇన్ స్టాలో వైరల్ గా మారింది. మీనాక్షి అభిమానులు ఒక్క క్షణం అలా వేచి చేసే అందమంటూ తనివి తీరుతున్నారు. ఇక కామెంట్ బాక్స్ లో పోస్టుల గురించైతే చెప్పాల్సిన పనిలేదు. అమ్మడికి లవ్ ప్రపోజల్స్ మామిలుగా వెళ్లలేదు. 'గుంటూరు కారం' తర్వాత ఆ ఫాలోయింగ్ రెట్టింపు అవ్వడం ఖాయం. త్రివిక్రమ్ అవకాశం ఇచ్చాడంటే? అమ్మడిలో ఆమాత్రం ఉన్న ప్రతిభని చేసే. మరి అమ్మడిని సెకెండ్ లీడ్ కి పరిమితం చేస్తారా? అంతకు మంచిన బాధ్యతలు అప్పగించారా? అన్నది చూడాలి. మిస్ ఇండియా కిరీటం సొంతం చేసుకున్న మీనాక్షి చౌదరి ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో సుశాంత్ కి జోడీగా నటించింది. ఆ సమయంలోనే త్రివిక్రమ్ ఆమెలో ప్రతిభని గుర్తించారు. ఇక రెండో సినిమాని ఏకంగా మాస్ మహారాజ్ రవితేజ హీరోగా తెరకెక్కిన ఖిలాడి సినిమాలో ఆడిపాడింది.

అటుపై అడవి శేషుతోనూ పని చేసింది. టాలీవుడ్ లో అమ్మడికి ముసు మ ముందు మంచి భవిష్యత్ ఉంది.

## ఆ హిట్టు మూవీ ప్రభాస్ చేయాల్సింది

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ గా తిరుగులేని ఇమేజ్ తో దూసుకుపోతున్నారు. అతని డిజాస్టర్ మూవీ కూడా వందల కోట్ల కలెక్షన్స్ ని కొల్లగొడుతోంది. ప్రస్తుతం సలార్, కల్కి 2898 ఏడీ సినిమాలు ఇండియాలోనే హ్యూజ్ బజ్ ఉన్న మూవీస్ గా ఉన్నాయి. ఆదిపురుష్ లాంటి డిజాస్టర్ కూడా ఏకంగా 350 కోట్ల వరకు కలెక్షన్స్ ని రాబట్టింది. బాహుబలి కంటే ముందు ప్రభాస్ చేసిన మిర్చి మూవీ కూడా సూపర్ హిట్ అయ్యింది. బాహుబలి మూవీ 2015లో రిలీజ్ అయ్యింది. అదే ఏడాది తమిళంలో జయం రవి తని ఒరువన్ సినిమా కూడా రిలీజ్ అయ్యి సూపర్ హిట్ అయ్యింది. మోహన్ రాజా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జయం రవి ఇమేజ్ ని అమాంతం పెంచేసింది. నిజానికి ఈ మూవీ కథని మోహన్ రాజా ప్రభాస్ ని దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసారంట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తని ఒరువన్



స్టోరీని ముందుగా ప్రభాస్ కి నేరేట్ చేయడం జరిగిందంట. అయితే ప్రభాస్ ఆ సమయంలో లవ్ స్టోరీ చేసే ఉద్దేశ్యంతో ఉన్నట్లు చెప్పారంట. దీంతో ప్రభాస్ తో పట్టాలు ఎక్కాల్సిన ఆ ప్రాజెక్ట్ కాస్త జయం రవి చేతికి వెళ్ళింది. దాంతో అతను బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకున్నారు. తరువాత ఇదే స్టోరీని తెలుగులో సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రామ్ చరణ్ చేశారు. రంగస్థలం మూవీ తర్వాత రామ్ చరణ్ ధృవ టైటిల్ తో తని ఒరువన్ రీమేక్ చేసి సూపర్ హిట్ కొట్టారు. అలా ప్రభాస్ బ్లాక్ బస్టర్ మూవీ మిస్ చేసుకోవడమే కాకుండా ఇద్దరు హీరోలు ఆ స్టోరీతో రెండు బ్లాక్ బస్టర్ హిట్స్ ని సొంతం చేసుకోవడానికి కారణం అయ్యారు. ఇది నిజంగా విశేషమని చెప్పాలి. ధృవ మూవీ తర్వాత రామ్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాని స్టార్ట్ చేసి ఇప్పుడు గ్లోబల్ స్టార్ గా తనకంటూ బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు. తని ఒరువన్ మూవీ మిస్ చేసుకున్న బాహుబలితో పాన్ ఇండియా స్టార్ గా ప్రభాస్ తనని తాను షోకేస్ చేసుకున్నారు.




# బిగ్ బాస్ సీజన్ 7: ఆ 14 మంది ఎవరు? వారి బ్యాక్ గ్రౌండ్ ఇదే




బిగ్ బాస్ 7 సీజన్ మొదలైంది. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన వారే.. చివరకు ఇంట్లోకి అడుగు పెట్టారు. ఎలాంటి సర్ ప్రైజ్ లు లేకుండా.. ముందు నుంచి అనుకున్న వారే ఇంట్లోకి రావటం జరిగింది. కాకుంటే.. మొదటి ఎపిసోడ్ లోనే అదిరే ట్విస్టు ఇచ్చిన కింగ్ నాగ్..ఈ సీజన్ మీద కొత్త ఆసక్తిని పెంచేలా చేశారు. ఇప్పటికి ఆరు సీజన్లు ముగించుకొని ఏడో సీజన్ ఉల్టాపల్టా అంటూ ఆశ్చర్యానికి గురి చేశారు. మొదటి ఎపిసోడ్ లోనే తమ సినిమాల్ని ప్రమోట్ చేసుకోవటానికి ఖుషీ హీరో విజయ్ దేవరకొండ.. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి హీరో నవీనన్ పొలిశెట్టి టీంలు సందడి చేశాయి. వారు ఇంట్లోకి వెళ్లి కంటెస్టెంట్లను ఉత్సాహపరిచారు. సీజన్ 7లోని మొదటి ఐదుగురు కంటెస్టెంట్లకు నాగార్జున అదిరే ఆఫర్ ఇవ్వటం ఈ ఎపిసోడ్ కు అదనపు ఆకర్షణగా మారింది. మొదటగా ఇంట్లోకి అడుగు పెట్టిన ఐదుగురు కంటెస్టెంట్లకు బిగ్ ఆఫర్ ఇచ్చారు నాగ్. బ్రీఫ్ కేసులో రూ.20లక్షలు పెట్టి.. వెళ్లిపోవాలనుకున్న వారు ఆ అమౌంట్ ను తీసుకొని బిగ్ బాస్ నుంచి వెళ్లిపోవచ్చన్నారు. ఆ ఆఫర్ ను పొందిన వారిలో ప్రియాంక జైన్.. శివాజీ.. దామిని భట్ల.. ప్రిన్స్ యువార్.. శుభశ్రీ ఉన్నారు. అయితే.. ఆ ఆఫర్ కు వారంతా నో చెప్పారు. అయితే.. తాను చెప్పిన రూ.20 లక్షలకు రూ.5 లక్షల చొప్పున పెంచుతూ వెళ్లారు. అలా రూ.20 లక్షల మొత్తం రూ.35 లక్షల వరకు వెళ్లిన వేళలో.. నటుడు శివాజీ.. ఆ అమౌంట్ విషయంలో కొంత ఆసక్తిని ప్రదర్శించారు. చివరి నిమిషంలో మనసు మార్చుకొని.. తనకు రూ.35 లక్షలు వద్దు.. బిగ్ బాస్ హౌస్ లో ఉండటమే ముద్దుగా తేల్చారు. మొదటి రోజే.. ఇంట్లో నుంచి వెళ్లిపోయేందుకు వీలుగా ఇచ్చిన ఆఫర్ చూస్తుంటే.. ఈ సీజన్ లో మరిన్ని షాకింగ్ ఆఫర్లు ఉంటాయన్న మాట వినిపిస్తోంది.

**బిగ్ బాస్ హౌస్ లోకి అడుగు పెట్టిన 14 మంది కంటెస్టెంట్లు ఎవరన్నది చూస్తే..**

**1. ప్రియాంక జైన్ :** చల్తే.. చల్తే.. వినరా సోదరా వీర కుమార తదితర చిత్రాల్లో హీరోయిన్ గా నటించిన ఆమె ప్రస్తుతం పలు సీరియల్స్ లో నటిస్తోంది.

**2. శివాజీ** తెలుగు ప్రజలకు సుపరిచితులు.. హీరోగా తనదైన సినిమాలతో అలరించి.. ఆపై రాజకీయాలతో.. సంచలన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో అందరూ తన గురించి మాట్లాడేలా చేశారు. ఆయన హీరోగా నటించిన చిత్రాల్లో మిస్టర్ అండ్ మిసెస్ శైలజా క్రిష్ణమూర్తి.. మిస్సమ్మ.. తాజ్ మహల్ చిత్రాలు హైలెట్. 2016లో సీసా ఆయన చివరి మూవీ. 2018లో గ్యాంగ్ స్టర్స్ అనే వెబ్ సిరీస్ లో కనిపించారు.

**3. దామిని భట్ల** బాహుబలిలో పచ్చబొట్టేసిన పిల్లగాడా నీతో.. కొండపొలంలో ధమ్ ధమ్ ధమ్ తదితర హిట్ పాటలతో గాయనిగా క్రేజ్ సొంతం చేసుకున్నారు.

**4. ప్రిన్స్ యువార్ :** పలు సీరియల్స్ లో నటించిన ఈ బాడీ బిల్డర్ యువ ప్రేక్షకులకు సుపరిచితులు

**5. శుభశ్రీ :** రుద్రవీణ మూవీతో టాలీవుడ్ కు ఎంట్రీ ఇచ్చిన ఈ ఒడిశా నటి కాలేజీ రోజుల్లో మోడలింగ్ చేసేవారు. మిస్ ఇండియా 2020 టైటిల్ను సొంతం చేసుకున్నారు. సినిమాలకు ముందు లాయర్ గా పని చేసిన మల్టీ టాలెంటెడ్.

**6.షకీలా :** మలయాళ చిత్రసీమలో స్టార్ హీరోలకు సైతం తన హాట్ సినిమాలతో చుక్కలు చూపించిన ఆమె తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. ఆమె ప్రత్యేక సినిమాలు ఒకప్పుడు సంచలనంగా మారటం తెలిసిందే. ఆమె వ్యక్తిగత జీవితం సినిమాకు ఏ మాత్రం తీసిపోని రీతిలో ఉండటం తెలిసిందే.

**7. సందీప్** టాలీవుడ్ లో కొరియోగ్రాఫర్ గా సుపరిచితుడు. ఇప్పటికే ఒక రియాల్టీ షోలో విజేతగా నిలిచిన ఇతగాడు.. బిగ్ బాస్ టైటిల్ తనదేనన్న ధీమాతో ఉన్నాడు.

**8. శోభాశెట్టి :** కార్తీకదీపం మోనికగా అందరికి తెలిసినవారే. సీరియల్ లో నెగిటివ్ రోల్ నటించినప్పటికీ నిజజీవితంలో మాత్రం తాను పాజిటివ్ అని చెబుతుంటారు. బుల్లితెర రమ్యక్రిష్ణగా ఆమెను పిలుస్తుంటారు. ఆమెను పరిచయం చేసే టైంలో నాగార్జున వెరైటీ రూల్ పెట్టారు. ఆమెను ఎవరైనా బ్యూటిఫుల్.. క్యూట్ అని ప్రశంసలు కురిపిస్తే.. వీకెండ్ లో అందుకు శిక్ష ఉంటుందన్న ట్విస్టు ఆసక్తికరంగా మారింది.

**9. టేస్టీ తేజ** యూట్యూబర్ గా గుర్తింపు పొందిన ఇతడు.. ఇప్పటికి 150మంది సెలబ్రిటీలతో కలిసి ప్రమోషన్స్ లో పాల్గొన్నాడు. తాను వండుతానని చెప్పిన ఇతను.. ఇంట్లోనూ వండుతానని చెప్పాడు.

**10. రతిక రోజ్** హీరోయిన్ గా నటించిన ఆమె.. సోషల్ మీడియాలోనూ ఇన్ ఫ్లూయెన్సర్ గా గుర్తింపు ఉంది. బిగ్ బాస్ ను పెద్దయ్యగా పేర్కొంటూ మిగిలిన వారికి భిన్నంగా నిలిచారు. డ్యాన్స్ తో పాటు.. మిమిక్రీ చేస్తానంటూ తనపై ఆసక్తిని పెంచే టాలెంట్ గురించి చెప్పుకొచ్చారు.

**11. డాక్టర్ గౌతమ్ క్రిష్ణ** డాక్టర్ నుంచి యాక్టర్ ఎలా అయ్యానన్న విషయాన్ని చెప్పుకొచ్చిన ఈ ఆకాశ వీధుల్లో మూవీ నటుడు తన చలాకీతనంతో ఆసక్తిని పెంచాడు.

**12. కిరణ్ రాథోడ్** తెలుగు మాత్రమే కాదు తమిళం.. మలయాళం.. హిందీ భాషల్లో పలు సినిమాల్లో నటించిన ఆమె తెలుగు ప్రజలకు సుపరిచితురాలు. తన అందంతో కట్టిపారేసే ఆమె.. ఇంట్లోకి వెళ్లే ముందు కొత్త విషయాన్ని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు ఫోన్.. కుక్కలు.. ఇంట్లో వాళ్లు లేకుండా ఉన్న పరిస్థితే లేదని.. మొదటిసారి వాటన్నింటికి దూరంగా ఉన్నట్లు చెప్పారు. హౌస్ నుంచి బయటకు వచ్చే లోపు తెలుగు నేర్చుకుంటానని చెప్పారు.

**13. పల్లవి ప్రశాంత్** యూట్యూబర్ గా అందరికి తెలిసిన రైతు బిగ్ బాస్ ఇంట్లోకి అడుగుపెట్టటం ఆసక్తికరం. మిగిలిన కంటెస్టెంట్లకు భిన్నంగా నాగార్జున ఆసక్తికర టాస్కు ఇచ్చారు. ఒక మిర్చి మొక్కను ఇచ్చి.. దాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చెట్టుకు మిరపకాయలు కాస్తే కొన్ని లాభాలు ఉంటాయన్న ఆఫర్ ఇస్తూ.. ఎండిపోతే మాత్రం శిక్ష తప్పదని హెచ్చరించటం గమనార్హం.

**14. అమర్ దీప్** నటుడిగా హౌస్ లోకి అడుగు పెట్టాడు. టాస్కులతో తన సత్తా చాటతానని చెప్పాడు.

# డ్రీమ్ గర్ల్ 2 .. టాక్ ఓడింది.. హీరో విల్ పవర్ గెలిచింది!




అబ్బాయి అమ్మాయిగా మారితే.. కొంటె కుర్రాళ్లకు అంకుల్స్‌కి వలపు బాణాలు విసిరితే.. ఆపై ఆ వింత మాయాజాలం ఎంతగా పని చేస్తుందో అర్థం చేసుకునేందుకు ఈ సినిమా కలెక్షన్లను పరిశీలించి చూడాలి. నిజానికి 2019 బ్లాక్ బస్టర్ మూవీ డ్రీమ్ గర్ల్ కి సీక్వెల్ తెరకెక్కిస్తున్నారు అనగానే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. కానీ ఈ సీక్వెల్ డ్రీమ్ గర్ల్ 2 రిలీజయ్యాక విమర్శకుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తగా, సగటు ప్రజలు కూడా యూట్యూబ్ లో చెత్త సినిమా అంటూ విమర్శించారు. కానీ డ్రీమ్ గర్ల్ 2 బాక్సాఫీస్ ఫలితం మాత్రం ప్రారంభ సమీక్షలకు విరుద్ధంగా ఉంది. డ్రీమ్ గర్ల్ 2 పేలవమైన సమీక్షలతో నిరాశపరిచినా కానీ.. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 100 కోట్ల గ్రాస్ వసూళ్ల దిశగా వెళుతోంది. ఒక వ్యక్తి అనివార్య పరిస్థితుల్లో స్త్రీలా దుస్తులు ధరించడం ఆ తర్వాత పురుష ప్రపంచంతో అతడి పోరాటం నేపథ్యంలో ఆద్యంతం కామెడీ టచ్ తో రూపొందించిన ఈ సినిమాకి యూత్ బ్రహ్మరథం పడుతోంది. నిజానికి ఈ కాన్సెప్ట్ కొత్తదేమీ కాదు. ఇంతకు ముందు హిందీ- తెలుగులో కూడా చాలా సినిమాలు వచ్చాయి. నిజానికి డ్రీమ్ గర్ల్ 2లో క్లీన్ కామెడీ లేదు. మంచి స్క్రిప్ట్ కూడా లేదు కానీ ఆయుష్మాన్ నటన, విజువల్ బ్రిలియన్సీ వర్కవుటవ్వడంతో ఈమాత్రం ఆదరణ దక్కిందని చెబుతున్నారు. 2022 తీవ్రంగా నిరాశపరిచినా కానీ 2023 బాలీవుడ్ కి బాగా కలిసొస్తోందని చెప్పాలి. ఒకదాని వెంట ఒకటిగా విజయాలు దక్కడం ఎంతో పెద్ద ఊరట. పఠాన్ తర్వాత గదర్ 2 ఘనవిజయం సాధించింది. షారూఖ్ ఖాన్- సన్నీడియోల్ లాంటి అగ్ర హీరోలు బిగ్ బ్యాంగ్ తో ఘనమైన కంబ్యాక్ ని చూపించారు. ఖిలాడీ అక్షయ్ నటంచిన ఓ మై గాడ్ 2 కూడా స్లీపర్ హిట్ గా నిలిచింది. కొన్ని వరుస పరాజయాల తర్వాత అక్షయ్ కి ఇది గొప్ప ఊరట. ఇప్పుడు ఆయుష్మాన్- డ్రీమ్ గర్ల్ 2 కూడా చక్కని వసూళ్లను సాధించింది. సత్య ప్రేమ్ కి కథ, రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ, తూ ఝూతీ మైన్ మక్కార్, జరా హత్కే జరా బచ్కే యావరేజ్ సినిమాలే అయినా నిర్మాతలకు నష్టాలు తేలేదు. డ్రీమ్ గర్ల్ 2 చక్కని లాభాలనే తెస్తోంది. ఇది నిజంగా బాలీవుడ్ కి గొప్ప ఊరట. కరోనా తర్వాత నెమ్మదిగా పరిశ్రమ కోలుకుంటోంది. అయితే దీనిని మరో లెవల్ కి తీసుకెళ్లాల్సిన బాధ్యత జవాన్- సలార్ చిత్రాలకు ఉందనడంలో సందేహం లేదు.

# మహేష్ బాబు గెస్ట్ రోల్.. ఏం జరిగింది?

ఈ మధ్య కాలంలో స్టార్ హీరోలు కూడా కాస్తా తమ స్టైల్ మార్చుకున్నారు. భాషలతో సంబంధం లేకుండా ఇతర హీరోల చిత్రాలలో నటించడానికి ఆసక్తి చూపిస్తున్నారు. బాలీవుడ్ స్టార్స్ సౌత్ సినిమాలలో నటిస్తున్నారు. అలాగే సౌత్ హీరోలు బాలీవుడ్ సినిమాలలో కీలక పాత్రలతో పాటు గెస్ట్ రోల్స్ కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ మూవీ టీం తమ సినిమాలో గెస్ట్ రోల్ కోసం సూపర్ స్టార్ మహేష్ బాబుని సంప్రదించారట. అయితే మహేష్ బాబు వారి ఆఫర్ ని ఇంకా ఎలాంటి నిర్ణయం చెప్పలేదంట. అలాగే ఆ చిత్ర యూనిట్ కి నో అని చెప్పలేదంట. దీంతో ఏమైనా గెస్ట్ రోల్ చేసే అవకాశం ఉందా అనే డౌట్ అందరికి వస్తోంది. ఇప్పటి వరకు తన కెరియర్ లో ఎవరి సినిమాలలో కూడా మహేష్ బాబు గెస్ట్ రోల్స్ చేయలేదు. అయితే ఒక సీరియల్ లో మాత్రం ఆరంభంలో



గెస్ట్ రోల్ లో మహేష్ బాబు కనిపించారు. మరి ఈ సారి తాను పెట్టుకున్న ఈ రూల్స్ ని మహేష్ బాబు బ్రేక్ చేసే అవకాశం ఉందా అనేది చూడాలి. ఒక వేళ మహేష్ బాబు గెస్ట్ రోల్ చేయడానికి ఒప్పుకుంటే మాత్రం వారికి ప్లస్ అయినట్లే. యితే సూపర్ స్టార్ మహేష్ బాబుని గెస్ట్ రోల్ కోసం సంప్రదించిన టీమ్ ఎవరా అనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రస్తుతం మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో గుంటూరు కారం మూవీ ఫినిష్ చేసే పనిలో ఉన్నారు. ప్రస్తుతం షూటింగ్ షెడ్యూల్ జరుగుతోంది. వీలైనంత వేగంగా ఈ చిత్రాన్ని కంప్లీట్ చేయాలని త్రివిక్రమ్ శ్రీనివాస్ భావిస్తున్నారు. ఈ మూవీ సంక్రాంతికి రిలీజ్ కానుంది. దీని తర్వాత రాజమౌళి దర్శకత్వంలో పాన్ వరల్డ్ మూవీని సెట్స్ పైకి తీసుకొని వెళ్లనున్నారు. ఈ ఏడాదిలోనే జక్కన్న మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా స్టార్ట్ అయ్యే ఛాన్స్ లు ఉన్నాయంట. ఈ మూవీలో హాలీవుడ్ యాక్టర్స్ కూడా నటించే ఛాన్స్ లు ఉన్నాయంట. ప్రస్తుతం మూవీ స్క్రిప్ట్ ఫైనల్ చేసే పనిలో విజయేంద్రప్రసాద్ ఉన్నారు. అతను స్క్రిప్ట్ సిద్ధం చేసిన తర్వాత జక్కన్న వర్క్ స్టార్ట్ కానుంది. ఈ చిత్రంలో సూపర్ స్టార్ మహేష్ బాబు వరల్డ్ అడ్వాంచర్ ట్రావెలర్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమాతో తెలుగు నుంచి పాన్ ఇండియా బాట పట్టబోతున్న చివరి స్టార్ హీరో మహేష్ బాబు అని చెప్పొచ్చు.

## ఆ సినిమా చేయొద్దని కాజల్ ని కోరుతున్న ఫ్యాన్స్..!

సౌత్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ఆఫ్టర్ మ్యారేజ్ కూడా తన సినిమాలతో ప్రేక్షకులను అలరించాలని చూస్తుంది. పెళ్లైన తర్వాత రెండేళ్ల పాటు గ్యాప్ తీసుకున్న కాజల్ ఇప్పుడు మళ్లీ వరుస సినిమాలు చేస్తూ బిజీగా మారింది. బాబు బాధ్యతలన్నీ ఫ్యామిలీకి అప్పగించి తను మళ్లీ సినిమాలతో హడావిడి చేస్తుంది. ప్రస్తుతం బాలకృష్ణ భగవంత్ కేసరి సినిమాలో నటిస్తున్న కాజల్ ఆ సినిమాతో పాటుగా సత్యభామ అనే ఫిమేల్ సెంట్రిక్ సినిమాలో నటిస్తుంది. ఆమధ్య వచ్చిన సత్యభామ టీజర్ చూసి కాజల్ ఫ్యాన్స్ షాక్ అయ్యారు. కెరీర్ లో ఇదివరకు ఎప్పుడూ చేయని డెర్ అటెంప్ట్ చేస్తుంది కాజల్. పవర్ ఫుల్ పోలీస్ పాత్రలో కాజల్ అదరగొట్టనుంది. సత్యభామ టీజర్ తోనే సినిమాపై బజ్ పెంచారు. కమల్ హాసన్ ఇండియన్ 2 లో కూడా కాజల్ స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. ఈ సినిమాలతో పాటుగా లేటెస్ట్ గా కాజల్ కోలీవుడ్ లో ఒక సినిమాకు సైన్ చేసిందట. ఆ సినిమాలో కాజల్ వేశ్య పాత్రలో కనిపిస్తుందని టాక్. కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడు అలాంటి ప్రయత్నాలు ఓకే కానీ పెళ్లై ఒక పిల్లాడు ఉన్న



ఈ టైం లో కాజల్ అలాంటి పాత్ర చేయడం ఆమె ఫ్యాన్స్ ని అసంతృప్తి కి గురి చేస్తుంది. కాజల్ వేశ్య పాత్రలో నటిస్తుందని తెలియగానే ఆమె ఫ్యాన్స్ అంతా కూడా సినిమా చేయొద్దని రిక్వెస్ట్ చేస్తున్నారు. ఇన్నాళ్లు తనకున్న స్టార్ ఇమేజ్ ఇలాంటి పాత్రలు చేయడం వల్ల పోతుందని కాజల్ ఫ్యాన్స్ కంగారు పడుతున్నారు. అయితే కాజల్ మాత్రం ఆఫ్టర్ మ్యారేజ్ అవకాశాలు రావడమే అరుదు కాబట్టి వచ్చిన ప్రతి ఛాన్స్ ని చేస్తూ వెళ్లాల్సిందే అని భావిస్తుంది. కాజల్ చేస్తున్న ఈ సినిమా కచ్చితంగా ఆమె కెరీర్ లో ఇప్పటివరకు చేసిన అన్ని సినిమాల కన్నా డిఫరెంట్ గా ఉంటుందని చెప్పొచ్చు.

టాలీవుడ్ లో స్టార్ హీరోలందరితో కలిసి నటించిన కాజల్ యువ హీరోలతో కూడా జత కట్టింది. అయితే పెళ్లి తర్వాత స్టార్స్ ఆమెతో నటించేందుకు అంతగా ఆసక్తి చూపించట్లేదు. అందుకే తన టాలెంట్ చూపించేలా లేడీ ఓరియెంటెడ్ కథలను ఎంచుకుంటుంది కాజల్. అయితే స్టార్ సినిమాల్లో ఛాన్స్ వస్తే మళ్లీ గ్లామర్ గా కనిపించేందుకు కూడా ఓకే అనేస్తుంది కాజల్. మరి కాజల్ కి అలాంటి ఛాన్స్ ఎవరు ఇస్తారన్నది చూడాలి.



# మాకు మేలు చేసేదైతేనే.. భారత్‌తో ఒప్పందం

లండన్: భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ కీలక వ్యాఖ్యలు చేశారు. మొత్తం యునైటెడ్ కింగ్‌డమ్‌కు మేలు చేసేదైతేనే ఒప్పందానికి అంగీకరిస్తామని మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో తెలిపారు. భారత్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు సునాక్ రానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని హోదాలో ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. వాణిజ్య ఒప్పందంపై భారత్‌తో చర్చలు కొనసాగుతున్నాయని కేబినెట్‌కు సునాక్ వివరించారు. ఇప్పటికే 12 దఫాలు చర్చలు జరిగినట్లు తెలిపారు. బ్రిటన్‌కు భారత్ విడదీయలేని భాగస్వామి అని అన్నారు. ఆర్థిక సవాళ్లతో పాటు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించేందుకు భారత్ పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత్‌తో అన్ని రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, యావత్ యూకేకు మేలు చేసే వాణిజ్య ఒప్పందానికి మాత్రమే తాము అంగీకరిస్తామని స్పష్టం చేశారు. యూకే బిజినెస్, ట్రేడ్ సెక్రటరీ కెమీ బడెనోచ్ ఇటీవలే భారత పర్యటన ముగించుకొని బ్రిటన్‌కు వెళ్లారు. ఇక్కడ ఆమె భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చలు జరిపారు. వాటి విశేషాలను ఆమె తాజాగా సునాక్ సమక్షంలో అక్కడి కేబినెట్‌కు వివరించారు. భారత్ ఇప్పటికే బ్రిటన్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అని తెలిపారు. ఇరు దేశాల మధ్య ఏటా 36 బిలియన్ జీబీపీలు విలువ చేసే వ్యాపార సంబంధాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. భారత్‌తో వాణిజ్య, రక్షణ, సాంకేతిక రంగంలో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని సునాక్ అభిప్రాయపడ్డారు. ఇది రానున్న దశాబ్దాల్లో బ్రిటన్ ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు. భారత పర్యటనలో సునాక్ ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే, భారత్‌లో ఆయన పర్యటన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. దిల్లీలోని హుమాయూన్ స్మారకాన్ని ఆయన తన సతీమణి అక్షతా మూర్తితో కలిసి సందర్శించే అవకాశం ఉన్నట్లు బ్రిటన్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.




# బ్రిక్స్‌లోనే 'భారత్'

'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' పేరిట రాష్ట్రపతి పంపిన ఆహ్వాన పత్రాలపై తాజాగా రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఇదే తొలిసారి కాదు.. ఇటీవల ఆగస్టులోనే ప్రధాని నరేంద్ర మోదీ దక్షిణాఫ్రికాలో జరిగిన 15వ బ్రిక్స్ సమావేశ నోటిఫికేషన్‌లో కూడా 'ఇండియా' స్థానంలో 'భారత్' పేరును వినియోగించారు. 'ది ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అని ప్రస్తావించారు. ఆ తర్వాత గ్రీస్ పర్యటనలో కూడా ఇలానే వాడారు. ఆగస్టు 22-25 మధ్యలో ఆ రెండు దేశాల్లో ప్రధాని పర్యటనకు సంబంధించిన నోటిఫికేషన్‌లో ఈ విషయం స్పష్టంగా ఉంది. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే తూర్పు ఆసియా సదస్సు, ఇండోనేషియాలో ఏషియన్ ఇండియా సదస్సుల నోటీసుల్లో కూడా 'ది ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ భారత్' అనే వినియోగించారు. ఈ సదస్సులు నేటి నుంచి జరగనున్నాయి.

**ఇండియా స్థానంలో భారత్! :** జీ-20 విదేశీ అతిథులకు పంపిణీ చేస్తున్న పుస్తకాల్లోనూ కేంద్ర ప్రభుత్వం ఇండియాకు బదులు భారత్ అని ముద్రించింది. ఈ సదస్సుకు నాయకత్వం వహించడాన్ని గుర్తు చేస్తూ 'భారత్, ద మదర్ ఆఫ్ డెమోక్రసీ'గా పేర్కొంది. ఇక్కడ వేల ఏళ్ల నుంచి ప్రజాస్వామ్య విలువలు నెలకొన్నట్లు తెలిపింది. రాజ్యాంగంలో ఇండియా అంటే భారత్, భారత్ అంటే ఇండియా అని ఉన్నందున దీన్ని ప్రత్యేకంగా చూడాల్సిన పని లేదని, దీని కోసం తీర్మానం చేయాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు.

# మహిళా బిల్లుపై ప్రధానిని ఎందుకు ప్రశ్నించలేదు..? సోనియాకు కవిత సూటి ప్రశ్న



పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో చర్చించడానికి తొమ్మిది అంశాలను ప్రతిపాదిస్తూ ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాసిన లేఖలో మహిళా రిజర్వేషన్ బిల్లు అంశం లేకపోవడాన్ని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కల్వకుంట్ల కవిత తీవ్రంగా తప్పుపట్టారు. ప్రధానికి రాసిన లేఖలో మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి ఎందుకు ప్రస్తావించలేదని సోనియా గాంధీని ట్విట్టర్ వేదికగా కవిత సూటిగా ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశం కాదా? అంటూ ప్రశ్నించారు. మహిళా బిల్లును కాంగ్రెస్ పూర్తిగా విస్మరిస్తున్నట్టు తేటతెల్లమైందని విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే ముఖ్యమైన మహిళా బిల్లుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని నిరూపితమైందని స్పష్టం చేశారు.



# వినాయక చవితి పర్వదినానికి అన్ని ఏర్పాట్లు చేస్తాం : మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, సెప్టెంబర్ 06 : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ నగరంలో అన్ని ఏర్పాట్లు చేస్తామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా పోలీస్, హెచ్‌ఎండీఏ, ఆర్ అండ్ బీ, మెట్రో, జలమండలి, హెల్త్, అగ్నిమాపక శాఖ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో పాటు డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ రోనాల్డ్ రోస్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో గణేష్ ఉత్సవాల ఏర్పాట్ల పై సమన్వయ సమావేశం బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మేటర్ మాట్లాడుతూ..వినాయక చవితి పండుగ ఉత్సవాల సందర్భంగా నగరంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. భాగ్య నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు సూచించిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని అన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. హెచ్‌ఎండీఏ ద్వారా స్టాటిస్టిక్స్ మొబైల్ క్రేన్లు గత ఏడాది కంటే ఎక్కువ క్రేన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లపై బారికేడ్, శానిటేషన్, పబ్లిక్ టాయిలెట్స్, మొబైల్ ట్రీ కటింగ్, ప్రూనింగ్, ఆరోగ్య శిబిరాలు, బోట్స్, స్విమ్మర్లు, నిరంతరంగా విద్యుత్తు సరఫరా, వీధి లైట్స్, పాట్ హోల్స్, రోడ్డు మరమ్మతులు, అగ్ని మాపక యంత్రాలు, తాగు నీటి సరఫరా తదితర ఏర్పాట్లు చేయనున్నట్లు మేయర్ తెలిపారు.

# బీజేపీ టికెట్ కోసం పోటీ పడుతున్న సెకండరీ గ్రేడ్ నాయకులు

హైదరాబాద్ : బీజేపీ దరఖాస్తుల స్వీకరణ మూడో రోజు కొనసాగుతోంది. దరఖాస్తు కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని బీజేపీ ఇంచార్జ్ ప్రకాష్ జావదేకర్ పరిశీలించారు. ఆశావాహులు, వారి అనుచరులతో బీజేపీ కార్యాలయంలో కోలాహలం జరుగుతోంది. ఇప్పటి వరకూ టికెట్ కోసం బీజేపీ ముఖ్యనేతలు దరఖాస్తు చేసుకోలేదు. ముఖ్య నేతలు ఏ ఏ నియోజకవర్గాల్లో టికెట్ కోసం దరఖాస్తు చేస్తారనే దానిపై బీజేపీలో ఆసక్తి చర్చ కొనసాగుతోంది.

ఖైరతాబాద్ టికెట్ కోసం పీవీ.నరసింహారావు మనవడు, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ దరఖాస్తు చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ టికెట్ కోసం మహిళా మోర్చా నాయకురాలు శ్యామల



దేవి దరఖాస్తు చేశారు. కాగా... బీజేపీలో సెకండరీ గ్రేడ్ నాయకులు సైతం టికెట్ కోసం పోటీ పడుతున్నారు.



# తాజ్ కృష్ణాలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం

హైదరాబాద్ : తాజ్ కృష్ణాలో కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. దీనికి స్క్రీనింగ్ కమిటీ సభ్యులంతా హాజరయ్యారు. రాష్ట్ర స్థాయిలో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు తుది దశకి చేరుకోనుంది. నేడు తుది నివేదిక రూపొందించడం జరగనుంది. సాయంత్రం సీల్డ్ కవర్లో కాంగ్రెస్ ఎలక్షన్ కమిటీకి స్క్రీనింగ్ కమిటీ నివేదికను అందించనుంది. ఇప్పటికే దాదాపు 30 మంది సభ్యులు ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాలకు స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థుల విషయమై కసరత్తు చేస్తోంది. త్వరలోనే అన్ని నియో జకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ వెలువరించనుంది.

# వరంగల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి



వరంగల్ : జిల్లా పర్యటనలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. సంగెం మండలంలోని గుంటూరుపల్లె, కాపులకనపర్తి గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులు ఎవరు అధైర్య పడొద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాల అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమమే లక్ష్యంగా రైతుబంధు, రైతుబీమా, రైతు వేదికలు వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావిణ్యతోపాటు వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

# పురానాపూల్ వద్ద మూసీ నది ఉధృతి.. 100 ఫీట్ల రోడ్డు మూసివేత



హైదరాబాద్ : హైదరాబాద్ శివార్లలో ఉన్న జంట జలాశయాలు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో మూసీ నదికి వరద ప్రవాహం పెరిగింది. దీంతో పురానాపూల్ వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పురానాపూల్ నుంచి లంగర్‌హౌజ్ వెళ్లే వంద ఫీట్ల రోడ్డుపైకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. మూసీ వరద ఉధృతితో వంద ఫీట్ల రోడ్డుపై అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఆ రహదారి వైపునకు వాహనాలకు అనుమతించడం లేదు. మూసీ పరివాహ ప్రాంత ప్రజలను కూడా అధికారులు అప్రమత్తం చేశారు. హిమాయత్ సాగర్‌కు 4 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 6 గేట్లు ఎత్తారు. మూసీలోకి 4,120 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హిమాయత్ సాగర్ ప్రస్తుత, పూర్తి నీటిమట్టం 1763.50 అడుగులుగా ఉంది. ఉస్మాన్ సాగర్ జలాశయం ఇన్‌ఫ్లో 2,200 క్యూసెక్కులుగా ఉంది. ఉస్మాన్ సాగర్ ప్రస్తుత నీటిమట్టం 1789.90 అడుగులు కాగా, పూర్తిస్థాయి నీటిమట్టం 1790 అడుగులుగా ఉంది. ఈ జలాశయం 6 గేట్లు ఎత్తి మూసీలోకి 2,028 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

# ఎమ్మెల్సీ కవితకు వైఎస్ షర్మిల లేఖ



హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల లేఖ రాశారు. "మహాత్మా గాంధీ చెప్పినట్లు మీరు చూడాలి అనుకుంటున్న మార్పు, మీ నుంచే మొదలు పెట్టండి. మీ పార్టీ పుట్టిన దగ్గర నుంచి 5శాతం కూడా మహిళలకు సీట్లు ఇవ్వలేదు. నా అభిప్రాయంతో పాటు, ఇటీవల బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితా కూడా పంపుతున్న. జాబితాతో పాటు ఒక కాలిక్యులేటర్ లింక్ కూడా పంపిస్తున్నా. బీఆర్ఎస్ జాబితా చూసి 33 శాతం ఇచ్చారా? లేదా? లెక్కించండి. మద్దతు కూడగట్టే ముందు మీ తండ్రితో ఈ విషయం చర్చ చేయాలని మనవి" అంటూ షర్మిల లేఖలో పేర్కొన్నారు.

# త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తాం



హైదరాబాద్: త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటిస్తామని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తెలిపారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌ను చాలా మంది కలిసి తమ అభిప్రాయాలు చెప్పారన్నారు.

అలాగే అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి విషయాలు పరిగణనలోకి తీసుకోవాలనే అంశంపై చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే మరోసారి స్క్రీనింగ్ కమిటీ సమావేశం ఉంటుందని చెప్పారు.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అలక చెందలేదన్నారు. కాంగ్రెస్‌లో ఆయన ముఖ్య నేత అని తెలిపారు.

# నల్లగొండలో ఇద్దరు యువతుల ఆత్మహత్య.. అశ్లీల ఫోటోలే కారణమా..?

నల్లగొండ : నల్లగొండలో డిగ్రీ చదువుతున్న ఇద్దరు యువతుల ఆత్మహత్య ఘటన కలకలం రేపుతోంది. డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్న ఇద్దరు యువతులు నిన్న రాజీవ్ పార్క్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందారు. వీరి మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలుకు చెందిన మనీషా, నక్కలపల్లికి చెందిన శివానీ అనే ఇద్దరు యువతులు హాస్టల్‌లో వుంటూ నల్గొండ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(బీజడ్‌సీ) ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. సెలవుల్లో ఇంటికి వచ్చిన వీరు మంగళవారం ఎగ్జామ్ ఉందని కాలేజీకి వెళ్లారు. ఎన్జీ కాలేజీ వెనుక ఉన్న రాజీవ్ పార్కుకు వెళ్లిన ఇద్దరు యువతులు గడ్డి మందు తాగారు. తాము పురుగుల మందు తాగామని హాస్టల్లోని తమ ఫ్రెండ్స్‌కు సమాచారం అందించారు. దీంతో స్థానికులు, పోలీసులు వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తెల్లవారుజామున ఇద్దరూ యువతులు మృతి చెందారు. యువతుల మృతిపై పలు అనుమానాలను వ్యక్తమవుతున్నాయి. శివానీ, మనీషాలు ఇద్దరూ ఫ్రెండ్స్ అని, ఎగ్జామ్ ఉందని నల్లగొండకు వెళ్లారని శివానీ తండ్రి చెబుతున్నారు. అయితే



ఏం జరిగిందో తెలియదు కానీ రాంనగర్ పార్కులో ఇద్దరు గడ్డి మందు తాగారని పోలీసులు సమాచార ఇవ్వడంతో తాము వెళ్లామని తండ్రి చెబుతున్నారు. వీరిద్దరూ ఆత్మహత్యయత్నానికి కారణం ఏందో తెలియదని చెబుతున్నారు. ఈ ఘటన సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతుల సెల్ ఫోన్లను ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపారు. అయితే వాట్సాప్ అకౌంట్‌కు డీపీగా పెట్టుకున్న ఫోటోలను కొందరు యువకులు మార్ఫింగ్ చేసి ఇన్‌స్టాలో పోస్టు చేసి, బెదిరింపులకు పాల్పడినందుకే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

# ఉదయనిధి, ప్రియాంక ఖర్గేలపై కేసు

లక్నో:మతపరంగా ఓ వర్గం ప్రజలను కించపరుస్తున్నారనే ఆరోపణలపై ఉదయనిధి స్టాలిన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక ఖర్గేపై యూపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే మతపరంగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో పోలీసులు సెక్షన్ 295ఏ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు స్పష్టం చేశారు. ఉదయనిధి స్టాలిన్, ప్రియాంక ఖర్గేలపై న్యాయవాదులు హర్ష గుప్తా, రామ్ సింగ్ లోధిలు ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మీడియా కథనాలను ఆధారాలుగా చూపుతూ మతపరమైన భావాలను కించపరుస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



**సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు..** సనాతన ధర్మంపై డీఎంకే నాయకుడు ఉదయనిధి స్టాలిన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మాన్ని డెంగ్యూ మలేరియా, కరోనా వంటి రోగాలతో పోల్చారు. దానిని వ్యతిరేకించడం కాదు.. పూర్తిగా నిర్మూలించాలని అన్నారు. ఈ పరిణామాల అనంతరం కర్ణాటక నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక ఖర్గే కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. దీనిపై సనాతనీయుల మారణహోమానికి పిలుపునిస్తున్నారని బీజేపీ ఆరోపించడంతో దేశస్థాయిలో పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com